ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 22 మార్చి 2026 | సంపుటి: 28 సంచిక: 02
Sunday 22 march 2026 | Vol.No 28 Issue No .02
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

- భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు
- రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సిఎం
- సిఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు

సిద్దిపేట,మార్చి2 : సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే





రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర మిగతా 2లో..

# ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

- స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్



హైదరాబాద్,మార్చి21 :తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన మిగతా 2లో..

# ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

- వాటికి చట్టబద్దత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్,మార్చి21 : ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మిగతా 2లో..

# శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

- నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం
- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రాంభోత్సవాలకు రావడం.. రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట,మార్చి21 : సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల



రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 2లో..

# జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

- పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి
- పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత
- భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి



మిగతా 2లో..

# ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత



న్యూఢిల్లీ,మార్చి21 : ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది మిగతా 2లో..




# హర్మూజ్ జలసంధిని తెరవండి

- ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి

న్యూఢిల్లీ,మార్చి21 : హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, మిగతా 2లో..

# ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం
- రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్



న్యూఢిల్లీ,మార్చి21 : పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు మిగతా 2లో..

# యుద్ధరీతులు మారుతున్నాయి

- యువత దేశ రక్షణకు నడుం బిగించాలి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ,మార్చి21 :నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మిగతా 2లో..

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

- 23న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు
- కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక
- రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం

విశాఖపట్టణం,మార్చి21 :అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ



ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ మిగతా 2లో..

# శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

- ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు
- వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు
- ఎఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు
- భక్తులను నేరుగా కలుసుకుని చర్చించిన చంద్రబాబు

తిరుమల,మార్చి21 : సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు



వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం మిగతా 2లో..

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ÷ల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరపున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు.ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ÷ల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

## ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

.ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్లు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్లు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

### హార్మూజ్ జలసంధిని తెరవండి

జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హార్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోందని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

### ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

### ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

### జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

జగిత్యాల,మార్చి21 : పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిదుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

# శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మేట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

## యుద్ధరీతులు మారుతున్నాయి

పేర్కొన్నారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

### నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.

# శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు.

భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు.

భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్ఠతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు .

## మియాపూర్‌లో దారుణ ఘటన

**- తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి**

**- కోపంతో యువతిపై కత్తితో దాడి**

హైదరాబాద్,మార్చి21 : మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. మె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త



నిజామాబాద్ మార్చ్21:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో శనివారం రంజాన్ పండుగను పురస్కరించుకొని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్సూర్యనారాయణ గుప్తాముస్లింసోదరులకుశుభాకాంక్షలు తెలిపారు. శనివారం నగరంలోని ఖిల్లా రోడ్ లో గల బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ఎండి రషీద్ ని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మైనార్టీ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రధాని మోదీ అన్ని మతాల వారికి కేంద్ర పథకాలు అందే విధంగా చూస్తున్నారన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ సుఖ సంతోషాలు కలగాలని కోరారు. అనంతరం పలువురికి ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పోరేటర్లు మఠం పవన్, చింతకాయల రాజేందర్, బంటు ప్రవీణ్, బళ్ళాల్ శశాంక్, ధాంపల్లి శివ, రాంపల్లి మురళి, బీజేపీ మైనార్టీ నాయకులు మునీరుద్దీన్, అసద్, మారవార్ కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



గద్వాల మార్చి 21 (విజన్ ఆంధ్ర)రంజాన్ పండుగను పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, ఇతర మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ కొరత లేదు పానిక్ బుకింగ్‌లు వద్దు

### డొమెస్టిక్ సిలిండర్ల దుర్వినియోగంపై కఠిన చర్యలు – జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 21, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు తగినంత గ్యాస్ నిల్వలో ఉండటంతో సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారుగ్యాస్ కొరతపై వ్యాపిస్తున్న పుకార్లను నమ్మవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనవసర భయాందోళనలకు లోనై పానిక్ బుకింగ్‌లు చేయడం వల్ల ఇతర వినియోగదారులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. బుకింగ్ చేసిన వినియోగదారులకు నిర్ణీత గడువులోపు డోర్ డెలివరీ ద్వారా సిలిండర్లు అందజేయబడుతున్నాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్ కోసం ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, అవసరమైనప్పుడు మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే, ప్రభుత్వం రాయితీపై గృహ అవసరాలకు అందిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ గ్యాస్ వినియోగాన్ని అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్యాస్ సరఫరా, డెలివరీలో ఆలస్యం లేదా ఇతర సమస్యలు ఎదురైతే ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1939 అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే స్పందించాలని, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## రేపు జరగబోయే ప్రజావాణి రద్దు చేసిన జిల్లా కలెక్టర్

సిద్దిపేటజిల్లా ప్రతినిధి మార్చి 21సిద్దిపేటలో జిల్లా 2027లో జరగనున్న జనాభా లెక్కల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్న సందర్భంగా, తేదిః 23-03-2026 సోమవారం కలెక్టర్ కార్యాలయం, సిద్దిపేటలోనిర్వహించనున్న ప్రజావాణికార్యక్రమాన్ని రద్దు పరిచినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఎవరు కలెక్టర్ కార్యాలయానికి ప్రజావాణి కోసం రావొద్దని విజ్ఞప్తి చేశారు.

# 'గ్యారంటీల పేరిట గద్దెనెక్కి.. రైతుల్ని, గల్ఫ్ బాధితుల్ని నట్టేట ముంచారు!

### ఇందూర్ పై కాంగ్రెస్ సర్కార్ వివక్ష ఇది పక్కా 'దగాకోరు' బడ్జెట్ దినేష్ పటేల్ కులాచారి, జిల్లా అధ్యక్షులు




నిజామాబాద్ మార్చ్ 21:(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై నిజామాబాద్ నగరంలో శనివారం ఈరోజు బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీ దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ...గ్యారంటీల పేరుతో గద్దెనెక్కి, ఇప్పుడు ఆ 'ఆరు గ్యారంటీల'ను పాతాళంలో పాతేసిన దగాకోరు బడ్జెట్. పేదలను నట్టేట ముంచి, సకల జనులనూ నిరాశలో నెట్టేసిన బడ్జెట్ లా ఉందిగల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. బడ్జెట్‌లో గల్ఫ్ బాధితులకు చిల్లిగవ్వ కేటాయించకపోవడం వారిని ద్రోహం చేయడమే. గతంలో టీఆర్ ఎస్ ప్రభుత్వం రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేవలం రూ. 300 కోట్లు వెచ్చించి మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించలేరా అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపు చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని ఎన్నికల సందర్భంగా హామీనిచ్చారు కానీ, నేటి బడ్జెట్లో దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం జిల్లా రైతాంగాన్ని మోసం చేయడమేమూసీ రివర్ ఫ్రంట్‌కు రూ. 1,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదు? అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితమా? ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1,000 కోట్లు ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం.. నిజామాబాద్‌లోని 'తెలంగాణ యూనివర్సిటీ' అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వివక్ష కాదా? బడ్జెట్‌లో ఆదిలాబాద్ విమానాశ్రయం గురించి ప్రస్తావించిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గారు, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జక్రాన్‌పల్లి విమానాశ్రయాన్ని ఎందుకు పట్టించుకోలేదు? ఈ బడ్జెట్ ఇందూర్ జిల్లా రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులోని ప్యాకేజీ 21, 22 పనులకు, అలాగే మంచిప్ప (మాసాని) రిజర్వాయర్‌కు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందిఇటీవల ఇందూర్ కు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిజామాబాద్ చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు, కానీ తాజా బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదు." గారడీ మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో మాత్రం ప్రజల గొంతు కోసింది. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, యువత వ్యతిరేక బడ్జెట్. ఇందూర్ జిల్లా అభివృద్ధికి, మూతపడిన చక్కెర ఫ్యాక్టరీకి, తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిన ఈ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు తేదీ: 23-03-2026న ఉదయం 10:00 గంటలకు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ యొక్క మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్ కార్ లక్ష్మీనారాయణ, ఓం సింగ్ నాయక్. పుట్ట వీరేందర్. బొబ్బిలి వేణు. ఇందూర్ సుధా. గడ్డం రాజు. అంబదాస్ రావు. ఆనంద్ విజయ్ కృష్ణ. ఆనంద్, బుల్లెట్ శీను తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, ప్రధాన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన పోలీస్ కమీషనర్



నిజామాబాద్ మార్చ్21:( విజన్ ఆంధ్ర)నిజామాబాదు పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాదు ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలోని అన్నీ ఈద్గాలు , ప్రధాన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లను, నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, పర్యవేక్షణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ,రంజాన్ పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా , ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భారీగా పోలీసు బలగాలను మోహరించడము జరిగింది అని, ప్రజలకు క్షేత్రస్థాయి నుండి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ పార్కింగ్ మరియు భద్రత చర్యలను ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాపండుగ దృష్ట్యా మార్కెట్లు మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీ టీమ్స్ ద్వారా నిఘా ఉంచడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. హానిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరూ శాంతియుతంగా, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ ఈద్గాల వద్ద ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరం లో శాంతినగర్ ఈద్గాల మదిన ఈద్గాల బోధన్ లోని నర్సి రోడ్డు ఈద్గాలను పోలీస్ కమిషనర్ పర్యవేక్షించడం జరిగింది . ఈ సందర్భంగా నిజామాబాద్ ఎ.సి.పి ప్రకాష్ , బోధన్ ఏ.సి.పి శ్రీనివాస్ రెడ్డి , ఆర్మూర్ ఎ.సి.పి వెంకటరెడ్డి , సిఐలు , ఎస్సైలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారిగా భక్తవత్సలం నియామకం



నిజామాబాద్ మార్చ్ 21:( విజన్ ఆంధ్ర)తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాలతో జిల్లా, నగర నూతన కమిటీలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కాటిపల్లి నగేష్ రెడ్డి, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ లు ప్రకటించారు. పార్టీ జిల్లా కోశాధికారీగా సీనియర్ నాయకుడు, బాపూజీ వచనాలయం చైర్మన్ భక్తవత్సలం (ఢిల్లీ )నియమితులయ్యారు. ఈ సందర్భంగా భక్తవత్సలం మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా పార్టీ కోశాధికారిగా అవకాశం కలిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మహ్మద్ అలీ షబ్బీర్, సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, తాహెర్ బిన్ హందన్ లకు ధన్యవాదములు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధి కీ కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా భక్తవత్సలంని తన స్వగృహంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ శాలువా తో ఘనంగా సన్మానించారు.

# శాంతి, సామరస్యాలకు ప్రతీక రంజాన్

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల మార్చి 21 (విజన్ ఆంధ్ర)రంజాన్ పండుగ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గద్వాల ఈద్‌గాహ్ వద్ద శనివారం ఉదయం జరిగిన ప్రార్థన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ పరస్పర గౌరవం, సేవాభావాన్ని, దాన గుణాన్ని పెంపొందించే పవిత్ర మాసమని తెలిపారు. హిందువులు, ముస్లింలు సహా అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి సఖ్యతతో జీవించాలని, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని కాపాడాలని కలెక్టర్ సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యతను కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజులపాటు ముస్లిం సోదరులు చేసిన ఉపవాస దీక్షల ఫలితంగా అల్లా దీవెనలతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించేందుకు రంజాన్ పర్వదినం ఉపకరిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిను పలువురు ముస్లింలు సన్మానించి, ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, పలువురు కౌన్సిలర్లు, ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ కలీం కు,ఆయన కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన – జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 21, (విజన్ ఆంధ్ర) రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ కలీంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న అధికారి నివాసానికి వెళ్లిన కలెక్టర్, ఆయన కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలీం కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు. రంజాన్ పర్వదిన ప్రత్యేకతలను వివరించగా, కలెక్టర్ ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంతరం ముస్లిం సోదరుల పవిత్ర పండుగ ప్రాముఖ్యత, జిల్లాలో కొనసాగుతున్న సామరస్య వాతావరణంపై పరస్పరం చర్చించారు. పండుగ వేళ కలెక్టర్ స్వయంగా నివాసానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలపడం పట్ల అబ్దుల్ కలీం కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

### –ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు



నిజామాబాద్, మార్చ్21:( విజన్ ఆంధ్ర)రంజాన్ పవిత్ర మాసంలో గత నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. శాంతి సామరస్యాలకు ప్రతీక అయిన రంజాన్ పండుగను నిజామాబాద్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలతో జరుపుకున్నారు . రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ యేటా జిల్లాలోని ఈద్గాలు ప్రార్థనలతో కోలాహలంగా దర్శనమిస్తాయి. ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనలతో ఈద్గాలు ఉదయం నుంచి కొలహాలంగా మారాయి. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్- ఉల్-ఫితర్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపు కున్నారు. నూతన వస్త్రాలను ధరించి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు . రంజాన్ మాసం అంతా కఠిన నియమాలతో ఉపవాస దీక్ష పాటించిన ముస్లిం సోదరులు శుక్రవారం నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్న కచ్చి మసీదులో ఉదయం 8 గంటల నుంచి, జామా మసీదులో ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి, సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవచనాలు ఖురాన్ పఠనం చేశారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఈద్ ముబారక్ అంటూ కుటుంబ సభ్యులకు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక వంటకాలు పాయసం షీర్ కుర్మా విందు ఏర్పాటు చేశారు. రంజాన్ రోజు ప్రత్యేకంగా పేద ప్రజలకు దానధర్మాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భావించి కొందరు ముస్లింలు పేదవారికి బట్టలు, బియ్యం దానం చేశారు. జాకర్త పేరిట ప్రతి సంవత్సరం పేదవాళ్లకు బట్టలు నిత్యావసర సరుకులు దానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. నెల రోజుల పాటు ప్రతి రోజు దానధర్మాలు చేయడం వల్ల తెలియక చేసిన పాపాలు తొలగిపోతాయని సంపూర్ణ దైవదర్శనం సిద్ధిస్తుందని ముస్లిం సోదరులు విశ్వసిస్తారు. ఉపవాస దీక్షను విరమించి, ప్రత్యేక ప్రార్ధనలు చేసి ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ముస్లిం సోదరులు ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ఈద్ ముబారక్ అనుకుంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా లో సామూహిక ప్రార్థనలతో సందడిగా మారింది. రంజాన్ మాసం భక్తిశ్రద్ధలతో ముగిసింది. ప్రార్థన మందిరాలు కళకళలాడాయి. జిల్లాలో ఈద్గాలు మసీదులు భక్తుల తాకిడి తో ఉదయం నుండి సందడిగా మారాయి . ముస్లిం సోదరులు కొత్త బట్టలు ధరించి, సుగంధం పన్నీరు పూసుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. వీధుల వెంట అలాయ్ బలాయ్ తీసుకోవడంతో రంజాన్ పండుగ సందడిగా మారింది.

## అజార్ త్యాగయ్యేనా మెడమీద వేళాడుతున్న కత్తి

హైదరాబాద్, మార్చి 21, తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం మాజీ క్రికెటర్, ప్రస్తుత మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామక అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండి, ఏ సభలోనూ సభ్యత్వం లేని మహ్మద్ అజారుద్దీన్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక క్లిష్ట దశకు చేరుకుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు శాసనసభ శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ గడువు ఏప్రిల్ ఆఖరుతో ముగుస్తుండటంతో, ఆయన పదవిపై సందిగ్ధత నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభం నుంచీ అనేక న్యాయపరమైన, రాజకీయపరమైన చిక్కులను ఎదుర్కొంటోంది. మొదట ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల పేర్లను గవర్నర్ కోటా కింద సిఫార్సు చేయగా, గత ప్రభుత్వం నియమించిన అభ్యర్థుల తిరస్కరణపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. దీంతో ప్రభుత్వం తన ప్రతిపాదనలను మార్చాల్సి వచ్చింది. రెండోసారి కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నందున గత గవర్నర్ ఈ ఫైల్‌పై నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఫిబ్రవరి 3న సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ, గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని, కోర్టు విచారణ దానికి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. దీంతో అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకం సుగమం అవుతుందని ప్రభుత్వం భావించినా, అప్పటి గవర్నర్ బదిలీ కావడంతో ఫైల్ మళ్లీ పెండింగ్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం కొత్త గవర్నర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# మోడల్ బస్టాండ్ పనులు పరిశీలించిన మంత్రి సీతక్క.





ములుగు మార్చి 21;విజన్ ఆంధ్ర ప్రతినిధిములుగు జిల్లా కేంద్రంలో రూ. 4.80 కోట్ల వ్యయంతో నిర్మించబడుతున్న నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం పరిశీలించి బస్టాండ్ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు ఆధునిక సదుపాయాలతో కూడిన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం వేచిచోట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు సమకూర్చబడతాయని పేర్కొన్నారు.ములుగు జిల్లా అభివృద్ధిలో భాగంగా ఈ బస్టాండ్ కీలక పాత్ర పోషిస్తుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో గిరిజన వాణి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు మార్చి 21;విజన్ ఆంధ్ర ప్రతినిధిఈ నెల 23వ తేదీన సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఈ నెల 23వ తేదీన సోమవారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ అర్జీలను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, తహాశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

### మున్సిపాల్ చైర్మన్అక్కి శ్రీనివాస్ గౌడ్



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి :పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ, దానగుణం, భక్తికి ప్రతిరూపమైన ఈ పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. శనివారం మున్సిపల్ పక్కల ఉన్న ఈదుగా దగ్గర చైర్మన్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో గడిపిన ముస్లిం సోదరులందరికీ ఈ ఈద్-ఉల్-ఫితర్ పండుగ శుభప్రదం కావాలని ఆకాంక్షించారు. పట్టణంలో మతసామరస్యం వెల్లివిరియాలని, అల్లాహ్ ఆశీస్సులతో అందరి ఇళ్లలో వెలుగులు నిండాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మి శివ, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ బుర్రమోని రాములు యాదవ్ కొంతం దయాకర్ రెడ్డి, మన్యం, రజక నరసింహ, డైరెక్టర్ రాములు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దు.. ధైర్యంగా ఉండండి

### -- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 21, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లింపులు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పంటల సాగు లేదా ఇతర సమస్యలపై వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు వ్యవసాయ అధికారులు లను సంప్రదించి తగిన సలహాలు పొందాలని సూచించారు.మానసిక ఒత్తిడితో బాధపడుతున్న రైతులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న టెలీ-మానస్ హెల్ప్‌లైన్ 14416 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నంబర్‌కు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల ద్వారా ఉచిత సలహాలు పొందవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఈ సేవలపై అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.ఇటీవల ఆదిలాబాద్ గ్రామీణ మండలం అర్లి (బి) గ్రామానికి చెందిన రైతు తుడుం గణపతి ఆత్మహత్య ఘటనపై స్పందించిన కలెక్టర్,గత నవంబర్ 18, 2025న గణపతి తీసుకువచ్చిన సోయాబీన్‌లో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టి మళ్లీ తీసుకురావాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. అనంతరం పట్టి నంబర్ 25ఖ133ు2324 ద్వారా 40 క్వింటాళ్ల సోయాబీన్‌ను రూ. 2,13,120లకు కొనుగోలు చేసినట్లు వివరించారు.అదేవిధంగా, కుటుంబ సభ్యుల పేర్లపై 27 క్వింటాళు (రూ. 1,43,856), 14 క్వింటాళ్లు (రూ. 74,592) కొనుగోలు చేసి, మొత్తం 81 క్వింటాళ్ల సోయాబీన్‌కు సంబంధించిన మొత్తం చెల్లింపులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చర్యలు ప్రారంభించామని తెలిపారు. త్రీ-మెన్ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం పరిహారం అందేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు.

# వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం

### విజిలెన్స్ దాడులు

### సిలిండర్లు స్వాధీనం ఒకరిపై కేసు నమోదు



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 21,(విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో గృహ అవసరాల కోసం ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై అధికారులు ఉక్కుపాదం మోపారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.

తనిఖీల సందర్భంగా గృహ వినియోగానికి మాత్రమే అనుమతించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాణిజ్య కార్యకలాపాల్లో వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.టీచర్స్ కాలనీ రోడ్ నంబర్ 16లోని ఓ ప్రాంగణంలో రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులు బాదం మిల్క్, ఐస్‌క్రీమ్, వివిధ రకాల స్వీట్ల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ కేంద్రంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల స్థానంలో తక్కువ ధరకు లభించే గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.పక్కా సమాచారంతో నిర్వహించిన ఈ దాడుల్లో అక్కడ పెద్ద సంఖ్యలో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగంలో ఉన్నట్లు తేలడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న ఓ వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం ఉదయం నిర్వహించిన తనిఖీలలో అతను గృహ సిలిండర్లను తన వ్యాపార కార్యకలాపాల్లో వినియోగిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో, అతనిపై 6ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాయితీపై అందించే గృహ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థల్లో వినియోగించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. వినియోగదారులు నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ భూస మహేష్, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ప్రారంభం

### బోథ్ పోలీస్ స్టేషన్ పరిశీలన

### రిబ్బన్ కట్ చేసి నూతన గదిని

### ప్రారంభించిన మహిళా కానిస్టేబుళ్లు

### – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 21, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం బోథ్ పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర అవసరాల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని జిల్లా ఎస్పీ శాస్త్రోక్తంగా, వేద మంత్రోచరణల నడుమ ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్లు సిహెచ్ లైలా, కోవ నవ్య, హోంగార్డ్ జయ శ్రీ లతో రిబ్బన్ కట్ చేయించి, పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన గదిని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, మండలంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పోలీసుల పట్ల నమ్మకం పెంపొందించే విధంగా విదుల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. విధులలో నీతి నిజాయితీని కనబరచాలని, అవినీతి చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి,బోథ్ ఎస్ఐ వి పురుషోత్తం, బజార్హత్నూర్ ఎస్సై సంజయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యంలో చేరేందుకు యువతకు సువర్ణావకాశం

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : భారత సైన్యంలో 2027 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో 'అగ్నివీర్' పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమైనట్లు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లాలోని అర్హులైన అవివాహిత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారా ఒఒ.యశీఅఅఅఅసఱఒఱఅతీఎఎ.అఱఎ.అఱ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఏప్రిల్ 01, 2026 వరకు గడువు ఉందన్నారు. అన్ని అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితిని 21 ఏళ్ల నుండి 22 ఏళ్లకు పెంచడం జరిగిందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ (10వ తరగతి & 8వ తరగతి పాస్) కేటగిరిలకు నియామకాలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఒజజ) అడ్మిట్ కార్డుల కోసం జూన్ 01 నుండి జూన్ 15, 2026 వరకు నిర్దేశించిన వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్ష తెలుగుతో సహా 13 భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు ఐటిఐ (ఓఒ×), డిప్లొమా మరియు ఎన్‌సిసి (చీజజ) అర్హత కలిగిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇవ్వబడతాయని తెలిపారు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా అత్యంత పారదర్శకంగా నిర్వహించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనే మోసగాళ్లను, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని, కేవలం ప్రతిభ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సందేహాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040-27740059 ను సంప్రదించవచ్చు.

## మతసామరస్యతకు ప్రతీక 'ఇఫ్తార్ విందు'

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



అల్వాల్, మార్చి 21,( విజన్ ఆంధ్ర): ఇఫ్తార్ విందు మతసామరస్యతకు ప్రతీక అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు.మచ్చబొల్లారం లోనిమసీద్-ఎ-అక్సా కమిటీ ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ సభకు ఆయన, డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ తో కలిసి హజరైనారు.ఈ సందర్భంగా మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు పండ్లు తినిపించి అందరికీ రంజాన్ శుభాకాం క్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ...రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైందన్నారు. ఈ మాసంలో ముస్లింలు కఠోరఉపవాసాలం ఉంటూ ప్రత్యేక నమాజ్ లతో అల్లా ను స్మరిస్తూ ఆయన ఆశీస్సులు పొందుతారని తెలిపారు. ధానధర్మాలతో పేదలను ఆదుకుని మానవత్వం చూపిస్తారన్నారు. పేద వారి ఆకలి బాధ ప్రతి ఒక్కరికిని తెలిపారు.ఐక్యత సోదరభావానికి ఇఫ్తార్ విందు ప్రతీకగా నిలుస్తుందన్నారు. శాంతి యుత, సామరస్య వాతావ రణంలో రంజాన్ జరుపు కోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ రాజగురు సుఖ్ దేవ్ ల ౯౫వ వర్ధంతి జయప్రదం చేయండి

### కమ్యూనిస్టు నాయకులు



ములుగు మార్చి 21;విజన్ ఆంధ్ర ప్రతినిధిశనివారం రైతు కూలి సంఘం , పిడిఎస్ యు(విజృంభణ)ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి కరపత్రం ఆవిష్కరణ చేసి రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మండల యుగేందర్ జిల్లా నాయకులు మండల ప్రదీప్, పడకంటి భరత్, మండల కృష్ణ కాంత్, బైరి యశ్వంత్, కొలిపాక కౌశిక్, సోనబోయిన అంజన్ కుమార్ తదితరులు మాట్లాడుతూషహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల అమరత్వాన్ని ఎత్తిపడుతు మార్చి 23తేదీన పల్లె పల్లెనా, పట్టణాల్లో సామ్రాజ్యవాద అధర్మం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సభలు సమావేశాలు జరుపుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## మంచి నిర్ణయం ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం

### జంపాల రవీందర్ ఏఐటీయూసీ నాయకులు



ములుగు మార్చి 21;విజన్ ఆంధ్ర ప్రతినిధి శనివారం ఏఐటియుసి జంపాల రవీందర్ ఒక ప్రకటనలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, వంట కార్మికుల తోనా? ప్రైవేట్ సంస్థ అయిన అక్షయ పాత్రతోనా? ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెట్టేవరకూ బాగానే ఉంటుంది కానీ అందులో పనిచేసే వంట కార్మికులకు సకాలంలో బిల్లులు చెల్లించరు, కేవలం రూ,, 3000/- లుగా ఉన్న వేతనాలు పెంచే పని చెయ్యరనీ, మెనూ చార్జీలు మార్కెట్ ధరలకు ప్రభుత్వం ఇస్థున్న ధరలకు ఏమాత్రం సరపోవడం లేదన్నారు. నాన్యమైన భోజనాలు అందించాలని ఒత్తిడి చేస్తే ఎలా అనే ఆలోచన లేకపోతే ఎలా, కనుక ప్రభుత్వం ఏదైనా పథకం ప్రవేశ పెట్టేటప్పుడు అందులో పనిచేసే కార్మికుల శ్రేయస్సు కూడా పరిగణలోకి తీసుకోవాలని,. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వం ద్రుష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోపోగా మరో పథకానికి నాంది పలికితే పలితం ఉండదు అని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ, జంపాల రవీందర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి తెలిపారు.

## మూడు నెలల బియ్యం ఒకేసారి!



ఖమ్మం మార్చ్ 21 (విజన్ ఆంధ్ర) ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి ఖమ్మంలోని రేషన్ కార్డుదారులకు పౌర సరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సుమారు 8 లక్షల మంది లబ్ధిదారులకు ఏప్రిల్ నెలలోనే మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నారు. ఎండల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ చర్యలు చేపట్టారు. ఖమ్మం జిల్లాకు 2.15 కోట్లు, భద్రాద్రికి 1.83 కోట్ల కిలోల సన్నబియ్యాన్ని ఇప్పటికే కేటాయించారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ

### ముస్లిం సహోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రంజాన్ పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని గోపాల్పేట రోడ్ లో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సహోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకుంటారని రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో నిష్టగా ముస్లిం సోదరులు మాసము మొత్తం ప్రార్థనలు చేసుకుని రంజాన్ పండుగ రోజున ఈద్గా ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి కుల మతాలకతీతంగా ఈ పండగలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసుకోవడం ఐక్యతకు మారుపేరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్



గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జూఎఎ సభ్యులు శంకర్ ప్రసాద్, వనపర్తి మండలం మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వారికి ఆదిత్య, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముస్లిం సోదరులు మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకు అన్యాయం

### బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్

మహబూబ్ నగర్ రూరల్ మార్చి 21 విజన్ ఆంధ్ర శాసనసభలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 3,24,234 కోట్ల బడ్జెట్ బీసీలను పూర్తిగా నిరాశపరిచి తీవ్ర అన్యాయానికి గురి చేసిందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో ఖండించారు.తెలంగాణలో బీసీలు 56% జనాభా అయినా ఈ బడ్జెట్‌లో వారి అభివృద్ధికి కేటాయింపులు చాలా తక్కువ అని రూ.12,511 కోట్లు మాత్రమే మొత్తం బడ్జెట్‌లో కేవలం 3.85% మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమన్నారు.. జనాభా ప్రాతిపదికంగా ఇది ఏమాత్రం సరిపోదనీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించినట్లుగా 20 వేల కోట్ల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని శ్రీనివాస్ సాగర్ ఆరోపించారు..గతంలో కేటాయింపులు పూర్తిగా ఖర్చు చేయకుండా మోసం చేసినట్లు ఈ ఏడాది కూడా గతంలో లాగా పునరావృతమవుతుందేమో అని అనుమానం వ్యక్తం చేస్తూబీసీ సబ్-ప్లాన్ లేదు, జనాభా ప్రాతిపదికంగా వాటా లేదు, కుల గణన ఆధారంగా ప్రత్యేక కేటాయింపులు లేవు అని బీసీలను ఏ మాత్రం పట్టించుకోకుండా బడ్జెట్ ను తయారు చేశారన్నారు..బీసీలు ఇప్పటికైనా మేల్కొని ఐక్యంగా పోరాడకపోతే ఇలారి మోసాలకు పాల్పడకుండా ఉండేందుకు అవకాశం ఉందనిఈ బడ్జెట్ బీసీ మెజారిటీ ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదనీ ఇది కొందరికి మాత్రమే అవకాశాలు ఇచ్చే బడ్జెట్ గా ఉందన్నారు..

## ముస్లిం సోదర సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు

### నెలరోజులపాటు కఠిన ఉపవాస దీక్ష మానవతావాదాన్ని శాంతిని చాటే గొప్ప పండుగ రంజాన్

### సర్పన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయ్యూబ్ ఖాన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 21 (విజన్ ఆంధ్ర) : పవిత్ర దైవ గ్రంథం ఖురాను అవతరించినది రంజాన్ మాసంలోనే అని సర్పన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయ్యూబ్ ఖాన్ అన్నారు. రంజాన్ పండుగకు మరో పేరు "ఈద్ ఉల్ ఫితర్" అని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఆయన విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారు. పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తాయి. ' పండుగ ' అనేది ఏ మతానికి సంబంధించినదైనా సరే..... దాని వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. ' పండుగ ' మానవాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే "రంజాన్" పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. ముస్లింలు చాంద్రమాన కేలండర్ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల "రంజాన్", దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే! క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే "రంజాన్" మాసం. రంజాన్ మాసం ఆత్మ నియంత్రణ దైవభక్తి దానధర్మాలకు ప్రతీక. నెల రోజుల పాటు పగలు ఉపవాసం (రోజా) ఉంటూ, ఖురాన్ పఠిస్తూ, పేదలకు సహాయం (జకాత్) చేస్తారు. మానవతావాదాన్ని, శాంతిని చాటుతూ, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే పెద్ద పండుగ రంజాన్ అని ఆయన గుర్తు చేశారు. కోపాన్ని, చెడు ఆలోచనలను అదుపులో ఉంచుకుని, దైవచింతనతో గడపడం, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం రంజాన్ మాసం ముఖ్య ఉద్దేశం. నెల రోజుల ఉపవాసాల తర్వాత, నెలవంక కనిపించాక జరుపుకునే సంబరమే ఈద్-ఉల్-ఫితర్. అందరూ కొత్త బట్టలు ధరించి, ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) చేసి, షీర్ ఖుర్మా తింటూ ఆనందాన్ని పంచుకుంటారు. రంజాన్ పండుగ మానవులలో ఓర్పు, దయ, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వలియత్ ఖాన్ సలీం మైబలి రహీం ఉస్మాన్ అనీఫ్ ఖాన్ షఫీ యక్తియార్ మోయిన్ గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయల అటెండన్స్ వివాదం

హైదరాబాద్, మార్చి 21,సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ఎఐ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

# అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన సన్మానం




మహబూబ్ నగర్ అర్బన్ మార్చి 21 విజన్ ఆంధ్ర ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా ఎంపిక కావడం పట్ల జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ సంతోషకర సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, కార్యకర్తలు హాజరై ఎమ్మెల్యేని గజమాలతో ఘనంగా సత్కరించారు. పూలహారాలు, శాలువాలతో ఆయనకు అభినందనలు తెలియజేసి, ప్రభుత్వ విప్‌గా ఆయన నియామకం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాదవ మహాసభ నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే గారు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో ముందుండే నాయకుడని కొనియాడారు. ఆయనకు వచ్చిన ప్రభుత్వ విప్ పదవి ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు, కృషికి లభించిన గుర్తింపు అని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఆయన ప్రజల కోసం మరింత శక్తివంతంగా పనిచేసి మహబూబ్ నగర్ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్ అభివృద్ధే తన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు శాంతన్న యాదవ్, సాయిలు యాదవ్, పెద్ద గొల్ల నర్సింహులు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, శ్రీనివాస్ యాదవ్, చందు యాదవ్, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనేక మంది యాదవ మహాసభ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పవిత్రమైన , శుభకరమైన ఈద్-ఉల్-ఫితర్




ఖమ్మం బ్యూరో మార్చి 21 (విజన్ ఆంధ్ర) ఇస్లాం కాలెండర్ ప్రకారం పవిత్ర మాసం,శుభకరమైన రమదాన్ మాసం లో సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ మొత్తం ముప్పై రోజులు చేసిన ఉపవాసం యొక్క ముగింపు వేడుక గా ఈద్-ఉల్-ఫితర్ పండుగను నిర్వహిస్తారు. ఈద్ అనేది ఒక అరబిక్ పదం, దీనర్థం "పండుగ", ఫితర్ అర్థం "ఉపవాసం యొక్క ముగింపు" అని అర్థం దివ్యఖురాన్‌లో దేవుడు చేసిన ఆదేశం ప్రకారం ముస్లింలు రమదాన్ యొక్క చివరి రోజున ఉపవాసంను ముగించాలి. ఈద్-ఉల్-ఫితర్ పుట్టింది. ఈ పండుగ యొక్క ఉద్దేశ్యం శాంతిని ప్రోత్సహించడం, సోదర భావనను బలోపేతం చేయడం.కొన్ని దేశాలలో ముస్లింలు మూడురోజుల సెలవుదినాలు పాటిస్తారు. ఆగ్నేయ ఆసియా దేశాలలో, ఈద్-ఉల్-ఫితర్, "గొప్పది" గా భావించబడుతుంది మరియు అక్కడ ఉన్న ముస్లింలకు ఇది చాలా ముఖ్యమైన సంబరంగా ఉంటుంది ఈద్ ఉల్ ఫితర్ దినాన విబిన్న దేశాలలోని ముస్లింలు అరబిక్ లో 'ఈద్ ముబారక్ ("ఆశీర్వదించబడిన ఈద్") లేదా 'ఈద్ సా'ఈద్ ("ఆనందకరమైన ఈద్")అని, టర్కీలో "బయ్‌రామినిజ్ కుట్లు ఒల్సున్" లేదా "మీ బయ్‌రామ్ ' ఈద్ - సంతోషకరంగా ఉండుగాక" అని పరస్పరం అబినంధించుకొంటారు. ఆ సంవత్సర కాలంలో ఏర్పడిన వ్యత్యాసాలను లేదా శత్రుత్వాలను మరచిపోమని మరియు క్షమించమని కూడా ఆరోజు ముస్లింలు అబ్యర్థించుకొంటారు ఈద్ ఉల్ ఫితర్ రోజు, ముస్లింలు సలాతుల్ ఫజ్ర్ (సూర్యోదయానికి ముందు ప్రార్థన) చేయటానికి సూర్యోదయానికి ముందే నిద్రలేస్తారు, మరియు సున్నా సంప్రదాయాలను నిర్వర్తిస్తూ దంతధావనాన్ని మిస్వాక్ లేదా టూత్‌బ్రష్ తో చేసుకుని, ఫజ్ర్ ప్రార్థనలు అయిన తరువాత స్నానం చేస్తారు(ఘుసుల్) , నూతన వస్త్రాలు ధరించి(లేదా ఉన్నవాటిలో మంచివి), అత్తరును పూసుకుంటారు. ఈద్ రోజు ఉపవాసం ఉండడమనేది హరాం, లేదా నిషిద్ధమైనది. అందుచే ప్రత్యేకమైన ఈద్ ప్రార్థనకు హాజరయ్యేముందు తియ్యటి అల్పాహారంను, ముఖ్యంగా ఒక ఖర్జూరం పండును తినమని సిఫారుసు చేయబడింది మరియు ముస్లిం లు బీదలకు మరియు అవసరంలో ఉన్నవారికి జకత్ చెల్లించవలసిన మొత్తం ఈద్ ప్రార్థన ముందు చెల్లిస్తారు.ముస్లింలు ఈద్ ప్రార్థనకు వెళ్ళేటప్పుడు తక్బీర్‌ను చదువుతారు ప్రార్థనా మైదానాల (ఈద్-గా) నుండి మరియు అక్కడి వరకూ రెండు మార్గాలను ముస్లిం లు ఉపయోగించటం సున్నత్ గా భావించబడుతుంది.ప్రార్థనలు ముగిసిన తరువాత, ముస్లింలు వారి చుట్టాలు, స్నేహితులు మరియు పరిచయస్తుల గృహాలను సందర్శిస్తారు లేదా గృహాలలో, సామాజిక కేంద్రాలలో లేదా అద్దె సమావేశ మందిరాలలో పెద్ద సామాజిక వేడుకలు జరుపుతారు. ఈదిస్ (ఈద్ బహుమతులు)లను తరచుగా పిల్లలకు మరియు దగ్గరి బంధువులకు ఇస్తారు; కొన్ని సంస్కృతులలో చుట్టాలు లేదా స్నేహితులు, పిల్లలకు డబ్బులు(ఈదిస్) ఇవ్వటం అనే సంప్రదాయం ఉంది

# తెలంగాణ బడ్జెట్లో గల్ఫ్ కార్మికులకు మొండి చెయ్యి



జన్నారం, మార్చ్ 21 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గల్ఫ్ కార్మి కులకు మరోసారి తీవ్ర నిరాశ ఎదురైందని ఈ బడ్జె ట్ ను తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర, జిల్లాల , మండలాల, దేశ శాఖా కార్యవర్గలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలంగాణ గల్ఫ్ కార్మి కుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కల్లెడ భూ మయ్య, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తి రుపతి అన్నారు. శనివారం రోజున మండలకేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం తన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధితోపాటు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బా ధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.గల్ఫ్ దేశాల్లో క ష్టపడి సంపాదిస్తూ తమ కుటుంబాలను పోషిస్తు న్న వేలాది మంది కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సంక్షేమం కోసం ప్రత్యేక గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి, అవసరమైన నిధుల ను కేటాయించాలి కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరం అని అ న్నారు. మా న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకొని గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పోరాడే అన్ని సంఘాలను కలుపు కుని పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య (రెడ్డి),ఉపా ధ్యక్షులు కొండు కూరి ప్రశాంత్, జన్నారం పట్టణ అధ్యక్షులు తాళ్ల పల్లి రాజేష్, క్యాషియర్ మరిపెల్లి అంజయ్య తది తరులు ఉన్నారు.

# ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహణ

## పర్యావరణ సంరక్షణపై కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు




హనుమకొండ జిల్లా ప్రతినిధి మార్చి 21,(విజన్ ఆంధ్ర)తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ, హనుమకొండ జిల్లా, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య, ఫారెస్ట్ కాంప్లెక్స్, సుబేదారినుంచి కాకతీయ జూలాజికల్ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురిదాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత,సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్

### రంజాన్ జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.





ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,మార్చ్21,(విజన్ ఆంధ్ర)మత కలహాలు లేకుండా సోదరభావంతో,ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలనిరాష్ట్ర రోడ్డు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ఆయన నల్గొండ పట్టణంలోనిమునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులతోకలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర దీక్షలు,ప్రార్థనలు చేశారని,క్రమశిక్షణ,దాతృత్వం,ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం అని అన్నారు.అల్లా వారందరి జీవితాలలో వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.అల్లా ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.ముస్లిం సోదరులంతా రంజాన్ పండుగను కుటుంబ సభ్యులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.నల్గొండ పట్టణంలోగత 30 సంవత్సరాలుగా హిందు,ముస్లింలు ఎలాంటి మత కలహాలు లేకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని,ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రూ.3 వేల500 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు.గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య,ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు.రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ,ఏ ఎస్ పి రమేష్.జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,తహసిల్దార్ పరుశు రాములు,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్,సుభాష్,నవీన్,అధికారులు,మైనార్టీ నాయకులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

### లారీ లో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం ముగ్గురు అరెస్ట్, లారీ సీజ్

మహబూబాబాద్ : జిల్లా టాస్క్ ఫోర్స్, కురవి పోలీస్ సంయుక్త ఆపరేషన్లో భాగంగా అక్రమ సారాయి తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై చర్యలు చేపట్టారు. చిత్తూరు నుండి మహబూబాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న లారీని కురవి శివారు సోమ్లా తండా సమీపంలో ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు ?8,00,000 విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం మరియు 10 క్వింటాళ్ల పట్టిక స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు గుగులోత్ సుమన్, ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్ లను అరెస్ట్ చేసి, లారీని సీజ్ చేసారు.

# భార్య యాదిలో: భర్త ఆత్మహత్య

### .. భార్య చనిపోయిన ఐదు రోజులకే ఎస్ఐ సూసైడ్
### .. వీధిన పడ్డ చిన్నారులు
### కరీంనగర్ జిల్లా జమ్మికుంట



మూడుముళ్ల బంధంతో ఒకటైన భార్యాభర్తల్లో భార్య అకాల మృత్యువాత పడడంతో ఆమె తనతో కలిసి ఉన్న జ్ఞాపకాలను మధుర క్షణాలను మరిచిపోలేక కలలో కనిపించి తనతో రావాలని అనడంతో ఆమె యాది లో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లాలో పెను విషాదాన్ని ఉంటుంది. కరీంనగర్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దేశం చంద్రశేఖర్(38) అనే వ్యక్తి కి ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన దివ్యతో గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు అశ్వత్థామ అభిమన్యు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య కడుపునొప్పితో బాధపడుతూ ఆమె ఇంట్లోనే విషపూరిత మందు తాగగాకరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామంలో నివాసంలోని అత్తగారి నివాసంలో భార్య దివ్య ఐదవ రోజు పిట్టకు పెట్టి ఇంటికి వచ్చిన ఎస్సై చంద్రశేఖర్ డ్రెస్ మార్చుకుంటాను అని చెప్పి గదిలోకి వెళ్లి ఎంతకైనా బయటకు రాకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తలుపు బ్రేక్ చేసి చూడగా ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని ఉండటానికి గమనించి హుటాహుటిన జమ్మికుంట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. గత మూడు రోజుల నుండి చనిపోతాను అని కుటుంబ సభ్యులతో బంధువులతో అన్నారని అలా చేసుకోవద్దని కుటుంబ సభ్యులు బంధువులు కౌన్సిలింగ్ చేసిన ఫలితం లేకుండాపోయినది.కడుపునొప్పితో భార్య దివ్య మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపంతో భర్త చంద్రశేఖర్ ఇంటి చెందడంతో ఇద్దరు చిన్నారులు అయ్యారు. కుటుంబ సభ్యుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుని సోదరుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.పోలీస్ అధికారుల సంతాపం...కరీంనగర్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎస్సై చంద్రశేఖర్ మరణం డిపార్ట్మెంట్కు తీరని లోటని అడిషనల్ డీసీపీ వెంకటరమణ హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. మృతి చెందిన చంద్రశేఖర్ మృతదేహాన్ని కరీంనగర్ సీఐలు రామచందర్ రావు, సృజన్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ గౌడ్ తో పాటు 2014 సంవత్సరానికి చెందిన ఎస్సై బ్యాచ్ ఘన నివాళులు అర్పించారు. భార్య స్వగ్రామమైన సీతంపేటలోనే పోలీసులు అధికార లాంచనాలతో చంద్రశేఖర్ కు అంత్యక్రియలు నిర్వహించారు.

# కోతుల దాడిలో వృద్ధురాలు మృతి



కాకినాడ, మార్చి 21: కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులో జీడిమామిడి తోటను ఆనుకుని ఉన్న ఇంట్లో దానబోయిన చిన్నబుల్లి (68) నివాసం ఉంటున్నారు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి చేయడంతో తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. చిన్నబుల్లి తనకు ఉన్న 3 ఎకరాల తోటలో తన కుమార్తె కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటోంది. ఈ ప్రాంతంలో కోతుల దాడిలో గాయపడిన ఘటనలు చాలా జరిగాయని.. అయితే ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారని గ్రామస్థులు వాపోయారు.

# మత సామరస్యానికి నిలయం సూర్యాపేట

## పేటలో భక్తి శ్రద్దలతో రంజాన్ వేడుకలు
## ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన ముస్లీం సోదరులు
## అలాయ్ బాలయ్ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

సూర్యాపేట మార్చి 21:(విజన్ ఆంధ్ర)ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పర్వదిన వేడుకలను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గత 30రోజులుగా కఠిన ఉపవాసదీక్షలను ఆచరించిన ముస్లీం సోదరులు రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్ద రంజాన్ సందేశాన్ని తెలిపారు. 13వ వార్డు కౌన్సిలర్ భూక్యా కౌసల్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన ఈద్గా వద్దకు చేరుకున్న ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్లతో పాటు మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, డీఎస్పీ ప్రసన్నకుమార్లు ముస్లీం సోదరులకు అలాయ్ బలాయ్ ఇచ్చి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 16వ వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్,2వ వార్డు



కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్,ఫారుక్ ల నివాసాలకు ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్లు వెళ్ళి వారు ఇచ్చిన ఖీర్ సేవించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి వారు ఇచ్చిన విందును స్వీకరించి మాట్లాడారు. మత సామరస్యానికి నిలయం సూర్యాపేట అన్నారు. పవిత్ర రంజాన్ మాసం మనకు సహనం, దానం, సోదరభావం వంటి గొప్ప విలువలను నేర్పుతుందన్నారు ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం నెలకొనాలని ప్రార్థిస్తూ ఈ పర్వదినం అందరికి మంచి ఆరోగ్యం, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. వేడుకల్లో 34వ వార్డు కౌన్సిలర్ తాహేర్,బీఆర్ఎస్ నాయకులు బాషామియా,సయ్యద్ సలీం, సల్మా మస్తాన్, కాంట్రాక్టర్ జలిల్,అహ్మద్ ఇర్ఫాన్,చాంద్ పాషా,బారీఖాన్ తో పాటు ఆయా పార్టీల నాయకులు మత పెద్దలు పట్టణ ప్రముఖులు అధికారులు మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంటల్లో బస్సు దగ్ధం..ప్రయాణికులు సురక్షితం



విజయనగరం విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. బస్సు వెనుక టైర్ పేలడంతో మంటలు చెలరేగాయి. భువనేశ్వర్ నుంచి మల్కన్ గిరికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టైర్ పేలగానే అప్రమత్తమైన డ్రైవర్, ప్రయాణికులను దించేశారు. మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉన్నారు.

# ట్రాప్ లో వైసీపీ పడిందా..!



కాకినాడ, : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల జరిగిన రెండు భారీ మానవ తప్పిదాలు రాష్ట్రాన్ని కుదిపేశాయి. వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో 28 మంది, రాజమండ్రి కల్తీ పాలు సేవించి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 42 కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చిన ఈ ఘటనలు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వైసీపీ ఈ ఘటనల పట్ల స్పందించిన తీరు, పార్టీ అగ్ర నాయకత్వం వహించిన మౌనం ఇప్పుడు ఆ పార్టీలోనే అంతర్గత మథనానికి కారణమవుతోంది. వేట్లపాలెంలో బాణసంచా తయారీలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల 28 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరోవైపు, రాజమండ్రిలో కల్తీ పాల సరఫరా కారణంగా మృతుల సంఖ్య రోజురో జుకూ పెరుగుతూ 14కు చేరింది. ఈ ఘోరాలు జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయం గా బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంతటి భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగినప్పుడు, ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ దూకుడుగా వ్యవహరించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో బాధితులకు భరోసా ఇవ్వడంలో పార్టీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి బాధితులను పరామర్శించి ఉంటే బాగుండేదని పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి. గతంలో పిఠాపురంలో ఇలాంటి ప్రమాదం జరిగినప్పుడు జగన్ స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మరి ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదం జరిగినా ఎందుకు స్పందించలేదనేది ప్రశ్నార్థకంగా మారింది. అయతే ఈ ఘటనలపై జగన్ కు సరైన సమాచారం లేదని కొంమంది చెప్తున్నారు. తాము జరిగిన విషయాన్ని ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలకు వివరిం చామని, నిర్ణయం తీసుకోవాల్సింది పైస్థాయి నాయకత్వమేనని జిల్లా నేతలు వాదిస్తున్నారు. అయితే.. జిల్లా నేతలు కేవలం సమాచారం ఇచ్చి వదిలేయకుండా, పదే పదే గుర్తు చేసి ఉండాల్సిందని, వారిలో చొరవ లోపించిందని పార్టీ పెద్దలు విమర్శిస్తున్నారు. ఇక్కడ మరో వాదన కూడా వినిపిస్తోంది. గోదావరి జిల్లాల్లో పార్టీ పెద్దగా యాక్టివ్ గా లేదని, కేడర్ మొత్తం చిన్నాభిన్నమైందని కొందరు చెప్తున్నారు. అందుకే ఈ జిల్లాకురావడానికి జగన్ ఇష్టపడలేదని పార్టీలోని కొన్ని వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పో యిన వారు, ప్రభావితమైన వారు వైసీపీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న సామాజిక వర్గాలేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాష్ట్రంలో ఇతర పెద్ద రాజకీయ అంశాలు లేని సమయంలో కూడా, ప్రభుత్వం విఫలమైన కోణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ ఆలస్యం చేసిందని పార్టీ వర్క్ షాప్ లో కూడా చర్చకు వచ్చింది. రాజకీయాలను పక్కన పెడితే, ఇంతటి భారీ మానవతాసంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజల పక్షాన నిలవాల్సినబాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నా, కమ్యూనికేషన్ లోపాలు లేదా వ్యూహాత్మక తప్పిదాల వల్ల వైసీపీఈ విషయంలోవెనకబడిందనేది స్పష్టమవుతోంది

# బాటిల్ నీళ్లు.. భగభగ

**– లీటర్ ధరపై 11 శాతం పెంపు**

**– ఇరాన్ సంక్షోభంతో పెరిగిన పాలిమర్ ధరలు**

న్యూఢిల్లీ : ఇరాన్‌పై యుద్ధం కారణంగా దేశంలోని ప్రజలపై ఏదో ఒక రూపంలో కనిపించని భారాలు పడుతున్నాయి. నిత్యావసరాలైన పప్పులు, నూనెలు ఇలా ఎన్నో వస్తువులపై నిలువుదోపిడీ కొనసాగు తోంది. తాజాగా బిస్లరీ వాటర్ బాటిల్ ధరలూ భగ్గుమంటున్నాయి. ప్లాస్టిక్‌బాటిళ్లు, మూతల ధరలుపెరగడంతో బాటిల్ నీటిపై 11 శాతం ధరను పెంచేశారు. దీంతో తక్కువనీటి పన్ను రేటు వల్ల కలిగే ప్రయోజ నం కాస్త తుడిచి పెట్టుకుపోయింది. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో స్వచ్ఛమైన నీరుఒకవరం. ఇక్కడ 70 శాతం భూగర్భ జలాలు కలుషిత మయ్యాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇప్పటికే చమురు ధర పెరిగింది. పరిశ్రమలకు అవసరమైన, ప్లాస్టిక్ బాటిళ్లకు కీలకమైన ముడి పదార్థం పాలిమర్ ధర సైతం పెరగడంతో మార్కెట్‌పై ఒత్తిడి ఎక్కువవుతోంది. దేశంలో అతిపెద్ద సంస్థ అయిన బిస్లరీ మార్కెట్‌లో మూడో వంతు వాటాను కలిగి ఉంది. దీంతో ఇప్పటి వరకు రూ. 216 (2.32 డాలర్లు)గా ఉన్న లీటరు పరిమాణం గల 12 బాటిళ్ల పెట్టె ధర సంక్షోభంతో ఇప్పుడు రూ. 240 (2.57 డాలర్లు)కు పెరిగింది. "పక్షం రోజుల్లో ప్యాకేజింగ్ సామగ్రి ఖర్చులు 70 శాతానికి పైగా పెరగడంతో, ప్యాక్ చేసిన తాగునీటి ధర లీటరుకు రూ.20 చేరింది" అని బిస్లరీ సీఈఓ ఏంజెలో జార్జ్ ఒక టెక్స్ట్ సందేశంలో తెలిపారు. యుద్ధం వల్ల "ఏం జరుగుతుందో ఎవరి అదుపులోనూ లేదు," అని ఆయన చెప్పారు. పన్ను ప్రయోజనాలు మాయం: ఇరాన్ యుద్ధం



కారణంగా పెరిగిన చమురు ధరల వల్ల, ప్లాస్టిక్ సీసాల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధర కిలోగ్రాముకు 50 శాతం పెరిగి 170 రూపాయలకు చేరింది. మూతల ధర రెండింతలకు పైగా పెరిగి ఒక్కొక్కటి 0.45 రూపాయలకు చేరింది. కార్రు గేటెడ్ పెట్టెలు, లేబుళ్లు, అంటుకునే టేపుల ధరలు కూడా పెరిగాయని గతంలో నివేదించింది. మోడీ ప్రభుత్వం సెప్టెంబర్‌లో బాటిల్ వాటర్‌పై పన్నులను 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో, అనేక కంపెనీలూ ధరలను తగ్గించాయి. ప్రస్తుత ధరల పెంపు ఆ ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. నీటి పరిశ్రమ వర్గం అందించిన ధరల పట్టికల ప్రకారం, భారతదేశానికి చెందిన పార్లే ఆగ్రో కూడా తన బెయిలీ బాటిల్ వాటర్ బ్రాండ్ ధరను సుమారు 11 శాతం పెంచింది. ఈ విషయంపై వ్యాఖ్యానించడానికి ఆ కంపెనీ నిరాకరించింది. క్లియర్ ప్రీమియం వాటర్ సీఈఓ నయన్ షా మాట్లాడుతూ.. భౌగోళిక, రాజకీయ పరిణామాల కారణంగా బాటిల్ వాటర్ రిటైల్ ధరను 8 శాతం నుంచి 11 శాతం వరకు పెంచినట్లు తెలిపారు. 'ధరల సవరణ అనివార్యమైంది' అని ఆయన వ్యాఖ్యానించారు.

# జనసేనతో బాలినేని కొలిక్కి వచ్చినట్టేనా



ఒంగోలు, మార్చి 21, ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చుట్టూ గత కొద్దిరోజులుగా నడుస్తున్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. ఆయన జనసేనను వీడి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) గూటికి చేరుతారనే ప్రచారానికి పవన్ కల్యాణ్‌తో జరిగిన భేటీతో చెక్ పడింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 'ఒంగోలు గిత్త'గా పేరుగాంచిన బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎన్నికల అనంతరం వైసీపీని వీడి జనసేనలో చేరడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, గత వారం రోజులుగా ఆయన పార్టీ మారుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో, ముఖ్యంగా వైసీపీ అనుకూల మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారమయ్యాయి. వార్తా సేవబాలినేని వైసీపీని వీడి జనసేనలో చేరినప్పటికీ, పాత పార్టీ నేతలతో ఆయనకు ఉన్న సంబంధాలు, ప్రకాశం జిల్లాలో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయన అసంతృప్తిగా ఉన్నారనే వార్తలు పుట్టుకొచ్చాయి. "బాలినేని మళ్ళీ సొంత గూటికి" అనే శీర్షికలతో వైసీపీ సోషల్ మీడియా విభాగం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. జగన్ మోహన్ రెడ్డి పట్ల ఆయనకు ఉన్న సానుకూలతను అస్త్రంగా చేసుకుని, ఆయన జనసేనలో ఇమడలేకపోతున్నారనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది. అయితే అలాంటి ఊహాగానాలకు ముగింపు పలుకుతూ బుధవారం బాలినేని శ్రీనివాస రెడ్డి మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి కూడా పాల్గొనడం విశేషం. కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాకుండా, జిల్లా రాజకీయాలు, భవిష్యత్తు కార్యాచరణపై పవన్‌తో ఆయన సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇవాళ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన విడుదల చేసిన పోస్టర్లలో పవన్ కల్యాణ్ ఫోటోను ప్రముఖంగా ఉంచడం ద్వారా, తాను జనసేనలోనే కొనసాగుతున్నాననే స్పష్టమైన సందేశాన్ని కేడర్‌కు, ప్రత్యర్థి పార్టీలకు పంపారు. బాలినేని పార్టీ మారుతున్నారనేది వైసీపీ ఆడుతున్న 'మైండ్ గేమ్' అని ఆయన వర్గీయులు చెప్తున్నారు. జిల్లాలో జనసేన బలపడకుండా చూసేందుకు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకే ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఒక సీనియర్ నేత పార్టీ మారి, మళ్ళీ వెనక్కి వస్తున్నారనే ప్రచారం ద్వారా జనసేన ప్రతిష్టను తగ్గించాలనుకుంటున్నారని చెప్తున్నారు. బాలినేని వెంట వచ్చిన అనుచరుల్లో అభద్రతా భావాన్ని నింపాలనుకుంటున్నారనేది వారి ఆరోపణ. వార్తా సేవప్రకాశం జిల్లాలో బాలినేనికి బలమైన కేడర్ ఉంది. ఆయన జనసేనలో ఉండటం కూటమికి పెద్ద ప్లస్ పాయింట్. ఒకవేళ ఆయన నిజంగానే వెనుదిరిగితే జిల్లాలో జనసేన డీలా పడే అవకాశం ఉండేది. కానీ, తాజా భేటీతో జనసైనికుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. పవన్ కల్యాణ్ కూడా బాలినేని అనుభవాన్ని జిల్లా అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి వాడుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. కానీ, ఒక నాయకుడి వ్యక్తిగత నిర్ణయాలపై సాగే తప్పుడు ప్రచారం తాత్కాలికంగా గందరగోళం సృష్టించినా, వాస్తవాలు వెలుగులోకి వచ్చినప్పుడు అది సదరు ప్రచారం చేసిన పార్టీకే నష్టం చేకూరుస్తుంది. బాలినేని శ్రీనివాస రెడ్డి పవన్ కల్యాణ్‌ను కలవడంతో ప్రకాశం జిల్లా రాజకీయాల్లో నెలకొన్న నీలినీడలు తొలగిపోయాయి. ఆయన తన రాజకీయ భవిష్యత్తును జనసేనతోనే ముడివేసుకున్నారని ఈ భేటీతో రూఢీ అయింది.

# వార్నింగ్ లతో సరి...



విజయవాడ, మార్చి 21, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో టీడీపీ వ్యవహార శైలి పై ఇటీవల చర్చలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ నేతల ప్రవర్తనపై ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మృదువైన వైఖరిని అవలంబిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకులు దారి తప్పుతున్నారని సమీక్షలు నిర్వహించడం, వారిని హెచ్చరించడం వరకే పరిమితమవుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల ఏలూరు ( ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వ్యవహారం ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది. ఇప్పటికే 2024లో డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఆయనపై మరోసారి అదే విధమైన ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికర పరిస్థితిని తీసుకొచ్చింది. గతంలో కూడా ఈ విషయంపై సీరియస్‌గా స్పందించినట్టు ప్రకటించినప్పటికీ, వాస్తవానికి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తోంది. చంద్రబాబు పాలనలో విజన్, అభివృద్ధి, పారదర్శకత వంటి అంశాలు ప్రాధాన్యం పొందుతున్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మాత్రం క్రమశిక్షణ లోపిస్తున్నదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఎంపీలు మధ్య విభేదాలు బయటపడటం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో కనీసం ఒక నాయకుడిపై అయినా కఠిన చర్యలు తీసుకుని ఉదాహరణ చూపించాల్సిన అవసరం ఉందని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. కానీ ప్రతి సారి "హెచ్చరించాం" అనే ప్రకటనలతో సరిపెట్టుకోవడం సమస్యను మరింత పెంచుతోందని అంటున్నారు. ఈ విధానం వల్ల నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోవాలనే ఒత్తిడి అనుభవించడంలేదని కూడా అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షం వైసీపీ పై దాడి చేయాల్సిన పరిస్థితుల్లో, తమ పార్టీ లోపాలే ముందుకు రావడం టీడీపీకి ఇబ్బందిగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ పనితీరు గురించి చెప్పుకోవాల్సిన సమయంలో, మరోవైపు నాయకుల వివాదాలు చర్చకు రావడం వల్ల పార్టీ ఇమేజ్‌పై ప్రభావం పడుతోంది. సీనియర్ నాయకులు సూచిస్తున్నది ఏమిటంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే క్రమశిక్షణను పునరుద్ధరించవచ్చని. సంఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నియంత్రణ చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే, టీడీపీకి ప్రస్తుతం ఉన్న సవాలు కేవలం రాజకీయ ప్రత్యర్థులతో మాత్రమే కాదు, పార్టీ అంతర్గత వ్యవహారాలను సరిచేసుకోవడంలో కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో నాయకత్వం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీ దిశను నిర్ణయించే అవకాశముంది.

# జగన్ కుమారుతున్న వ్యూహకర్తలు

విజయవాడ, మార్చి 21వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం తన రాజకీయ ప్రస్థానంలో అత్యంత కీలకమైన వ్యూహకర్తల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, పార్టీని గాడిలో పెట్టేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. 2019లో అఖండ విజయానికి కారకుడైన ప్రశాంత్ కిషోర్‌ను దూరం చేసుకున్న ఐప్యాక్ పై భారం వేసిన జగన్, ఫలితాల తర్వాత వారిని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎన్నికలకు ముందు ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి మనం సుదీర్ఘ కాలం కలిసి ప్రయాణం చేద్దాం అని చెప్పిన జగన్, ఫలితాల షాక్‌తో నిర్ణయాన్ని మార్చుకున్నరా?.ఐప్యాక్ నిష్క్రమణ తర్వాత వైసీపీ శిబిరంలో పలువురు వ్యూహకర్తల పేర్లు వినిపించాయి. ముఖ్యంగా బీజేపీ కోసం పనిచేసిన అనుభవం ఉన్న శంతను సింగ్ వంటి వారిని లైన్‌లోకి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మరికొందరు జాతీయ స్థాయి కన్సల్టెంట్లను సంప్రదించినా, జగన్ తీరు , ఆయన ఆలోచనా విధానానికి అనుగుణంగా ఎవరూ ఇమడలేకపోతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. తాజాగా ఈషా సింగ్ అనే యువ వ్యూహకర్త పేరు తెరపైకి వచ్చింది. ఈమె గతంలో పలువురు ప్రముఖులకు సోషల్ మీడియా, పొలిటికల్ బ్రాండింగ్ విభాగాల్లో పనిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నేతృత్వంలో వైసీపీకి కొత్త ఇమేజ్ ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. జగన్ మోహన్ రెడ్డి మనస్తత్వం ప్రకారం ఆయన ఒకసారి నమ్మితే పూర్తి బాధ్యతలు అప్పగిస్తారు, కానీ ఆశించిన ఫలితాలు రాకపోతే అంతే వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆయనకు కేవలం డేటా మాత్రమే కాదు, తన వ్యక్తిత్వాన్ని , క్షేత్రస్థాయి క్యాడర్ భావోద్వేగాలను ప్రతిబింబించే వ్యూహాలు కావాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యూహకర్తలు కేవలం సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు పరిమితమవుతున్నారే తప్ప, ప్రత్యర్థి కూటమిని ఢీకొట్టే బలమైన రాజకీయ అజెండాను సృష్టించడంలో విఫలమవుతున్నారనే అభిప్రాయం ఉంది

## సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజనల్ రింగ్ రోడ్

హైదరాబాద్, మార్చి 21,హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 161.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారిపై ఏఐ కెమెరాలు, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందేలా పోలీసు, రవాణా శాఖలను అప్రమత్తం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సగం తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ సూపర్ గేమ్ ఛేంజర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

# అసోంలో ఇక హిమంతకు ఉద్వాసనే

## కాంగ్రెస్ కూటమి గెలుస్తుందన్న గొగోయ్

గువాహటి,మార్చి21: అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లలో పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తెలిపారు. ఐదు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నట్టు చెప్పారు. బీజేపీ వ్యతిరేక ఓట్లలో చీలిక ఉండకపోవచ్చని, తద్వారా హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ ఇంతవరకూ 94 మంది అభ్యర్థులను ప్రకటించింది.'అస్సాంలోని ఆరు విపక్ష పార్టీలైన కాంగ్రెస్, అస్సాం జాతీయ పరిషత్, రైజోర్ దళ్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 100 మంది అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలే అవకాశం ఉండదనుకుంటున్నాం. హిమంత బిశ్వా శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావంతో ఉన్నాం' అని గొగోయ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ భాగస్వామ్య పక్షమైన రైజోర్ దళ్‌కు 11 సీట్లను కేటాయించింది. కాగా, అభ్యర్థుల నామినేషన్ల పక్రియ ఈనెల 23తో ముగియనుంది. ఏప్రియల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి. మే 20వ తేదీతో ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుంది.

# ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు

## నాలుగు వారాల్లోనే రావొచ్చు
## యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ హెచ్చరిక




న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం మేర అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం మేర అంతరాయం కలిగితేనే ప్రపంచ జిడిపిలోనూ 4 నుంచి 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి కంపెనీల వద్ద ఉన్న నిల్వలకారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ సరఫరా గొలుసులో ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్, వాహన తయారీ రంగాలు కీలక ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్యాస్ కొరతతో సూరత్ టెక్స్‌టైల్ రంగంలో ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. ఇది కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని వివరించారు.

ఆర్థిక నష్టం విపరీతంగా పెరిగి అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల నుండి ఒత్తిడి పెరిగినప్పుడే యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు వెనక్కి తగ్గే అవకాశం ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం వల్ల కలిగే ఆర్థిక భారంతో అన్ని దేశాలు నష్టపోతాయని హెచ్చరించారు. అందుకే ఈ యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగకపోవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలకు ఏదైనా నష్టం వాటిల్లితే మాత్రం పరిస్థితి మరింత దిగజారి.. జిడిపి రికవరీ ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# కాకినాడ పోర్టులో చౌకబియ్యం పట్టివేత

## విదేశాలకు తరలిస్తుండగా అధికారుల దాడి

కాకినాడ,మార్చి21 విదేశాలకు ఎగుమతి చేసేందుకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి.. మొత్తం 5 లారీల్లోని 140 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యం విలువ రూ.65 లక్షలు ఉంటుందని అంచనా. అయితే ఎవరు వీటిని సరఫరా చేస్తున్నది తెలియాల్సి ఉంది. గతంలో పేర్నినాని తరలించిన బియ్యం వ్యవహారం సద్దు మనగక ముందే మరోమారు పెద్ద ఎత్తున బియ్యం పట్టుబడడం విశేషం.



# మరో భారీ సైబర్ మోసం

## మోసపోయిన మాజీ డిజిపి మనవరాలు
## నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా
## ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం

హైదరాబాద్,మార్చి21: టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు.ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# కథ కంచికేనా..!



కడప,: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మృతిపై ఇక ఏమీ తేలదు. ఇప్పటికి ఇంతే. సీబీఐ కూడా సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో కొత్తగా ఎవరినీ నిందితులుగా చేర్చలేదని, అదనపు ఆధారాలు లభించలేదని నివేదించింది. ట్రయల్ కోర్టు లో విచారణను వేగవంతం చేసి, నాలుగు వారాల్లోగా ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసులో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలన్న విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత పోరాటం కూడా ముగిసినట్లేనని అనుకోవాలి. ఇక వైఎస్ వివేకా మృతిలో మిస్టరీ వీడే అవకాశం లేనట్లే కనిపిస్తుంది.వైఎస్ వివేకా మృతి జరిగి ఏడేళ్లు కావస్తుంది. గొడ్డలి పోట్లు ఉండటంతో అది హత్య అని అందరూ ఆరోపించు. ఇప్పటి వరకూ హత్యకు గల కారణాలు.. హత్య చేసిందెవరన్నది తేల్చలేకపోయారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఒంటరి పోరాటం చేస్తున్నారు. న్యాయ పోరాటం చేశారు. ఈ హత్య కేసులో ఆధారాలు లభించలేదా? లేక ఆధారాలను చెరిపేయడంతో విచారణలో అసలు వాస్తవాలు బయట కు రావడం లేదా? మరి దేశంలోనే అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరిం చిన సీబీఐ వల్ల కూడా కాలేదంటే అసలు ఈ కేసు ఇక మూలనపడిన ట్లేనని అంటున్నారకు.ఒక హత్య జరిగితే వెంటనే దానికి గల కారణాలను, నిందితులను ఎక్కడున్నా పట్టుకునే దర్యాప్తు అధికారులు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీని ఎందుకు ఛేదించలేకపోతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి ఆధారాలున్నా.. ఏమా త్రం సాంకేతికమైన చిన్నపాటి క్లూ లు లభించినా దర్యాప్తు అధికారులు వదిలిపెట్టే ప్రశ్న ఉండదు. కానీ వివేకానంద రెడ్డి హత్య జరిగింది 2019లో. ఏడేళ్లుగా కుమార్తె డాక్టర్ సునీత పోరాటం చేస్తుంది. కానీ హత్యకు గల కారణాలు కూడా తెలియరాలేదు. ఇక నిందితులె వరూ లేరని, అందుకు తగిన ఆధారాలు లభించలేదని చెప్పడంతో వైఎస్ వివేకా హత్య కేసు ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోనుంది.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక విషయాలు గత ఏడేళ్లుగా ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నిజానిజాలు ఆ భగవంతుడికే తెలి యాలి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. ఒక మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఇన్నేళ్లవుతున్నా కనీసం హత్యకు గల కారణాలను బయట ప్రపంచానికి తెలియకపోవడంతో ఇక దర్యాప్తు సంస్థలపై కూడా ప్రజలకు దురభి ప్రాయం ఏర్పడే అవకాశముంది. అలాంటి వారికే న్యాయం జరగన ప్పుడు ఇక సామాన్యులకు సరైన న్యాయం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. వైఎస్ వివేకానందరెడ్డిది సహజ మరణం కాదు.కానీ అందుకు గల కారణాలు ఇప్పటి వరకూ తెలియకపోవడం మాత్రం దురదృష్టకరమే.

# ఆస్తుల లొల్లికి ఫుల్ స్టాప్... కామానా..

విజయవాడ, మార్చి 21, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల చిచ్చు మరోసారి బహిర్గతమైంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ శుక్రవారం ఒక కీలక అఫిడవిట్‌ను దాఖలు చేశారు. " వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదు.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని ఆమె ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టం చేశారు. విజయమ్మ తన అఫిడవిట్‌లో జగన్ వాదనలను పూర్తిగా తప్పుపట్టారు. 2009లో వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే . ఆస్తుల పంపకం ఎప్పుడూ అధికారికంగా జరగలేదన్నారు. తన మనవలు, మనవరాళ్లు నలుగురికి ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఉద్దేశ్యం, ఆజ్ఞ అని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, ఎంఓయూ లో లేని బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, అది వైఎస్సార్ ఆజ్ఞ అని తెలిపారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అంటే షర్మిల పిల్లలకు అన్యాయం చేశాడని, ఇప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ అఫిడవిట్‌ను వైఎస్ విజయమ్మ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో సమర్పించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల బదిలీకి సంబంధించి జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ పత్రాన్ని నోటరీ చేయించి, అధికారికంగా ట్రిబ్యూనల్‌కు అందజేశారు.షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందంటూ జరుగుతున్న ప్రచారాన్ని విజయమ్మ తీవ్రంగా ఖండించారు. షర్మిల వద్ద ఉన్న ఆస్తులు జగన్ ఇచ్చినవి కావు, అవి ఆమెకు రావాల్సిన వాటా మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే తనను బినామీగా చిత్రీకరించవద్దని, దేవుడి సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని మీడియాను వేడుకున్నారు.గతంలో వైఎస్ జగన్, షర్మిల మధ్య జరిగిన ఎంఓయూ ప్రకారం కొన్ని ఆస్తులను బహుమతిగా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. వైఎస్ ఫ్యామిలీ ఆస్తులపై ఇంటాబయటా పెద్ద రచ్చ జరుగుతోంది. పలువురు వైసీపీ నేతలు ఈ అంశంపై ప్రెస్ మీట్లు పెట్టి షర్మిలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫిడవిట్ ద్వారా ఆస్తులపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఇప్పటివరకు అసలు



జరగలేదని ఆమె కుండబద్దలు కొట్టారు. జగన్ ఎంవోయూరాసింది కూడా షర్మిల హక్కును గుర్తించేనని, అది ఏమాత్రం దానం కాదని ఆమె స్పష్టం చేశారు.వైసీపీ నేతలు మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని విజయమ్మ గోబెల్స్ ప్రచారంగా అభివర్ణించారు. షర్మిలకు జగన్ వేల కోట్లు ఇచ్చారని ప్రచారం చేయడంపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇచ్చిన డబ్బు ఆస్తి పంపకం కాదని, వ్యాపార లాభాల నుంచి ఇచ్చిన డివిడెండ్ మాత్రమేనని ఆమె క్లారిటీ ఇచ్చారు."నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి తెలుసు" అని అనడం ద్వారా విజయమ్మ ఒక తల్లిగా జగన్ మనస్సాక్షిని తట్టిలేపే ప్రయత్నం చేశారు. తన మేనల్లుడికి, మేనకోడలికి (షర్మిల పిల్లలకు) జగన్ అన్యాయం చేస్తున్నాడని ఆవేదన చెందారు. సరస్వతి సిమెంట్స్‌తో పాటు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ కూడా షర్మిలదేనని ఆమె తేల్చి చెప్పారు.రాజకీయ ప్రయోజనాల కోసం తన కుటుంబాన్ని వాడుకోవద్దని ఆమె మీడియాను కోరారు. అసత్యాలు ప్రచారం చేస్తున్న వారెవరైనా సరే, దేవుడి న్యాయమే అంతిమమని ఆమె పేర్కొనడం ద్వారా నైతిక పైచేయి సాధించే ప్రయత్నం చేశారుఈ అఫిడవిట్ ద్వారా విజయమ్మ ఒక ముఖ్యమైన సాక్షిగా మారారు. రేపు కోర్టులో ఆస్తుల వివాదం నడిచినప్పుడు, వైఎస్సార్ బతికున్నప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె చెప్పిన మాటలు జగన్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. షర్మిల ఒంటరిగా పోరాడుతుందనే భావన కలగకుండా, కుటుంబ పెద్దగా విజయమ్మ ఆమె పక్షాన నిలిచారు. వైఎస్సార్ ఆశయం ప్రకారం నలుగురు మనవలకు సమాన వాటా దక్కాలనే పాయింట్‌ను ఆమె బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు."దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలే" అని ముగించడం ద్వారా విజయమ్మ ఈ వివాదానికి అత్యున్నత ప్రాధాన్యతను ఇచ్చారు. అధికార బలంతోనో, అబద్ధపు ప్రచారాలతోనో గెలవాలని చూసేవారికి ఆమె పరోక్షంగా చురకలు అంటించారు. వైఎస్ కుటుంబంలో ఆర్థిక చిచ్చు ఇప్పట్లో తగ్గేలా లేదు. వైయస్ కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ తాజాగా వేసిన అఫిడవిట్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారుతుంది. తన సొంత కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి.. తన మనవలైన షర్మిల పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడంటూ ఆమె నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో అఫిడవిట్ దాఖలు చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంతవరకు ఆస్తుల పంపకం జరగలేదని.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని ఆమె తేల్చి చెప్పారు. తన నలుగురు మనవలు, మనవరాళ్లకు ఆస్తులను సమానంగా పంచాలన్నదే రాజశేఖర్ రెడ్డి ఆఖరి కోరికగా, ఆజ్ఞగా ఆమె గుర్తు చేశారు. కొంతకాలంగా వైఎస్ కుటుంబంలో ఆస్తి వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు ఇతర ఆస్తుల విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విజయమ్మ తన కుమార్తె షర్మిలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్మోహన్ రెడ్డి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. తన తల్లి షేర్ ను చెల్లెలు షర్మిల దక్కించుకోవడంపై పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గత కొద్దిరోజులుగా వాదనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫీడవిట్ దాఖలు చేశారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి దక్కాల్సిన వాటాలు ఇవ్వకుండా మోసం చేయడం పై విజయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు యలహంక ఇల్లు కూడా షర్మిల దేనని.. ఇది వైయస్సార్ స్వయంగా ఇచ్చిన ఆదేశమని ఆమె స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కారణాలతో లేదా ఇతర విభేదాలతో తన చెల్లెలి పిల్లలకు రావాల్సిన ఆస్తులను జగన్ అడ్డుకోవడం ధర్మం కాదని ఆమె ఆ ప్రత్యేక న్యాయస్థానానికి పేర్కొన్నారు. షర్మిల అడుగుతోంది కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమెకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటాయే తప్ప.. జగన్ ఇచ్చే బహుమతి కాదని కూడా తేల్చి చెప్పారు.జగన్ తన తల్లి మాటలను మన్నించి తన సోదరికి న్యాయం చేస్తారా? లేక ఈ వివాదం రాజకీయ రచ్చగా మారుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే, రాజకీయ కారణాలు, ఇతర విభేదాల వల్ల ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించగా, అది తన హక్కు అని షర్మిల వాదిస్తున్నారు. ఇప్పుడు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగి షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

# ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ,మార్చి21: ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్టు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

### అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

### రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

హైదరాబాద్,మార్చి21:మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ పక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## కేరళలో కమలం కొత్త మంత్రం

తిరువనంతపురం, : కేరళ రాజకీయాల్లో పాగా వేయాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ, అక్కడ కేవలం హిందూత్వ కార్డుతోనే విజయం సాధించలేమని గుర్తించి, వ్యూహాత్మకంగా తన రూటు మార్చింది. ముఖ్యంగా రాష్ట్ర జనాభాలో దాదాపు 18-20 శాతం ఉన్న క్రైస్తవులను ఆకర్షించేందుకు క్రిస్టియన్ మంత్రం పఠిస్తోంది.కేరళలో దశాబ్దాలుగా క్రైస్తవ సమాజం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కి వెన్నెముకగా ఉంటూ వస్తోంది. అయితే, ఇటీవల ముస్లిం లీగ్ ప్రభావం యూడీఎఫ్‌లో పెరిగిందన్న భావన క్రైస్తవుల్లో ఒక రకమైన అసంతృప్తిని కలిగిస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న బీజేపీ, క్రైస్తవులను తనవైపు తిప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ పునాదులను దెబ్బతీయాలని చూస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్ విజయం , సురేష్ గోపీకి లభించిన క్రైస్తవ ఓట్ల మద్దతు ఈ వ్యూహం ఫలిస్తున్నదని బీజేపీ బలంగా నమ్ముతోంది.ముస్లిం జనాభా పెరుగుదల, వక్ఫ్ బోర్డు భూముల వివాదాస లవ్ జిహాద్ వంటి అంశాలపై క్రైస్తవ సమాజంలో ఉన్న ఆందోళనలను బీజేపీ తన రాజకీయాస్త్రాలుగా మలుచుకుంటోంది. ఈ అంశాల్లో క్రైస్తవ మత పెద్దలకు మద్దతుగా నిలవడం ద్వారా, మీ ప్రయోజనాలను రక్షించేది మేమే అనే సంకేతాన్ని పంపిస్తోంది. ముఖ్యంగా కాథలిక్ చర్చిలోని కొన్ని వర్గాలు ఇటీవల బీజేపీ వైపు మొగ్గు చూపడం, ఆర్ఎస్ఎస్ ( నేతలు బిషప్‌లతో చర్చలు జరపడం ఈ సామాజిక ఇంజనీరింగ్ లో భాగమే.కేవలం మాటలకే పరిమితం కాకుండా, పార్టీ పదవుల్లో క్రైస్తవులకు పెద్దపీట వేస్తోంది. కేంద్ర మంత్రిగా జార్జ్ కురియన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనీల్ ఆంటోనీ వంటి వారిని ముందుంచడం ద్వారా క్రైస్తవ వ్యతిరేక పార్టీ అనే ముద్రను చెరిపేసే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అధిక సంఖ్యలో క్రైస్తవ అభ్యర్థులను నిలబెట్టాలని, తద్వారా ప్లాన్-బి కింద క్రైస్తవ ప్రాబల్యం ఉన్న మధ్య కేరళలో పట్టు సాధించాలని ప్లాన్ చేస్తోంది. ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ స్నేహయాత్ర వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. క్రిస్మస్, ఈస్టర్ పండగల సమయంలో బీజేపీ నేతలు చర్చిలను సందర్శించడం, క్రైస్తవ కుటుంబాల ఇళ్లకు వెళ్లి మోదీ ప్రభుత్వ పథకాలను వివరించడం వంటివి క్షేత్రస్థాయిలో మార్పు తెస్తున్నాయి. ముఖ్యంగా రబ్బర్ ధరల పతనం వంటి ఆర్థిక అంశాలపై కేంద్రాన్ని ఒప్పించి రైతులకు మేలు చేస్తామని హామీ ఇవ్వడం ద్వారా కేరళలోని సిరో-మలబార్ చర్చి మద్దతును పొందేందుకు గట్టి ప్రయత్నం చేస్తోంది.బీజేపీ వ్యూహానికి కొన్ని ప్రధాన సవాళ్లు కూడా ఉన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో క్రైస్తవ మిషనరీలపై జరుగుతున్న దాడులు, మణిపూర్ హింసాకాండ వంటి అంశాలను ఇతర పార్టీలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఒకవైపు ఇక్కడ స్నేహం నటిస్తూనే, మరోవైపు దాడులు చేస్తున్నారు అనే ప్రచారాన్ని క్రైస్తవ సమాజంలోకి తీసుకెళ్లడంలో ప్రతిపక్షాలు కొంతవరకు సఫలమవుతున్నాయి. ప్రస్తుతానికి బీజేపీ వేస్తున్న అడుగులు కేరళలో త్రిముఖ పోటీకి తెరలేపాయి. క్రైస్తవ ఓట్లలో కనీసం 10-15 శాతం చీల్చగలిగినా, అది ఎల్డీఎఫ్ లేదా యూడీఎఫ్ ల గెలుపోటములను శాసిస్తుంది. . బహిరంగంగా బీజేపీని వ్యతిరేకించే క్రైస్తవులు కూడా రహస్యంగా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికలే బీజేపీ ఈ క్రైస్తవ మంత్రం ఎంతవరకు పారిందో తేల్చే అసలైన తీర్పు కానున్నాయి.

## వడివడిగా రైల్వే జోన్ అడుగులు

విశాఖపట్టణం, మార్చి 21 ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల అయిన విశాఖపట్నం రైల్వే జోన్ సౌత్ కోస్ట్ రైల్వే - నాఅనీఖీ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన ఈ జోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని, విశాఖలోని ముడసర్లోవ వద్ద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 52.2 ఎకరాల భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకుందని ఆయన వెల్లడించారురైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 106.89 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటికే పునాది పనులు పూర్తయ్యాయి. 2025 జనవరిలోనే ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన జరిగింది. అయితే, భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, తక్షణమే పాలన సాగించేందుకు వీలుగా విశాఖలోనిభవనం ది డెక్ ను సిద్ధం చేశారు. త్వరలోనే ఇక్కడి నుండే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జనరల్ మేనేజర్ ,ఇతర ఉన్నతాధికారుల నియామక ప్రక్రియ కూడా పూర్తయినట్లు మంత్రి స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే కేటాయింపుల విషయంలో కేంద్రం రికార్డు స్థాయి నిధులు కేటాయిస్తోంది. 2009-14 మధ్య కాలంలో ఏటా సగటున రూ. 886 కోట్లు మాత్రమే ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీకి ఏకంగా రూ. 9,417 కోట్లు కేటాయించడం విశేషం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు కొత్త లైన్లు , డబ్లింగ్ పనులతో కలిపి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. గతంతో పోలిస్తే ట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపైందని, ఏటా సగటున 143 కి.మీల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. కొత్త ప్రాజెక్టుల విషయానికి వస్తే, అమరావతి రాజధాని ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య 57 కి.మీల కొత్త రైల్వే లైన్ కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

## పట్టాలపైనే నిలిచిపోయిన హైదరాబాద్ మెట్రో రైళ్లు..

### తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు!

హైదరాబాద్ : నిత్యం వేలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో నేడు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాగోల్ - రాయదుర్గం మార్గంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపో యాయి. దీంతో ఆఫీసులకు, కళాశాలలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఉదయం రద్దీ సమయంలో నాగోల్ నుండి రాయదుర్గం వెళ్లే మార్గంలో ఒక్కసారిగా మెట్రో రైళ్లు నిలిచిపోయాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిగ్నలింగ్ వ్యవస్థలో లేదా విద్యుత్ సరఫరాలో తలెత్తిన సాంకేతిక సమస్యే దీనికి ప్రధాన కారణం. రైళ్లు స్టేషన్ల మధ్యలో, పట్టాలపైనే నిలిచిపోవ డంతో లోపల ఉన్న ప్రయాణికులు ఉక్కపోతతో, ఆందోళనతో గడిపారు. రైళ్లు కదలకపోవడంతో ప్రయాణికులు మెట్రో కోచ్‌లలోనే సుమారు 30 నిమిషాల పాటు చిక్కుకుపోయారు. సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రయాణికులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. రైల్వే స్టేషన్లలో కూడా రద్దీ విపరీతంగా పెరిగిపోయి, ప్రయాణికుల మధ్య తోపులాట వంటి దృశ్యాలు కనిపించాయి. ముఖ్యంగా అమీర్



పేట్, ప్రకాష్ నగర్, హైటెక్ సిటీ స్టేషన్లలో రద్దీని నియంత్రించడం సిబ్బందికి కష్టతరంగా మారింది. మెట్రో సాంకేతిక బృందం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టింది. సుమారు 30 నిమిషాల కృషి తర్వాత సాంకేతిక లోపాన్ని సరిదిద్దారు. అనంతరం మెట్రో రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం సర్వీసులు యధావిధిగా నడుస్తున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రయాణికులకు కలిగిన అంతరాయానికి సంస్థ విచారం వ్యక్తం చేసింది.

## నెమ్మదిగా సాగుతున్న పనులు

### రెండో విడత భూసమీకరణపై నీలినీడలు

విజయవాడ, : ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణం ప్రస్తుతం కీలక దశలో ఉంది. 2024లో పనులు పునఃప్రారంభమైన తర్వాత దాదాపు రెండేళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పురోగతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమరావతిలో ఐకానిక్ భవనాలైన అసెంబ్లీ, హైకోర్టు మరియు సచివాలయ టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధారణ మౌలిక సదుపాయాల పనుల్లో జాప్యం కనిపిస్తోంది. ముఖ్యంగా ట్రంక్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైన్ల వంటి పనులు అంచనా వేసిన దానికంటే నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో అమరావతి పనులు అనుకున్న విధంగా పూర్తవుతాయా లేదా అన్న సందేహం ప్రారంభమయింది. ఇది రెండో విడత భూసమీకరణ మీద ప్రభావం చూపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధాన కాంట్రాక్టు సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 10 నుండి 20 శాతం వరకు మాత్రమే భౌతిక పురోగతిని సాధించాయి. భారీ వర్షాలు, సాంకేతిక కారణాలు ఈ మందగమనానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధి విషయంలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మొదటి విడతలో దాదాపు 33,000 ఎకరాలు ఇచ్చిన రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన ప్లాట్లు అందలేదు. ప్లాట్ల వద్ద రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం వంటి కనీస వసతులు లేకపోవడంతో ఆ ప్లాట్లు అమ్మకానికి గానీ, గృహ నిర్మాణాలకు గానీ అనుకూలంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దాదాపు 1,300 కోట్లు లేఅవుట్ల అభివృద్ధి కోసం కేటాయించినప్పటికీ, పనులు ఆశించిన వేగంతో జరగకపోవడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.రాజధానిని మరో 16,000 నుండి 20,000 ఎకరాల మేర విస్తరించాలని ప్రభుత్వం రెండో విడత భూసమీకరణను ప్రారంభించింది. అయితే, మొదటి విడతలో భూములిచ్చిన రైతులకు కలిగిన ప్రయోజనంపై స్పష్టత లేకపోవడంతో, కొత్తగా భూములిచ్చేందుకు రైతులు వెనుకాడుతున్నారు. వైకుంఠపురం, పెదమద్దూరు వంటి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నా, రైతుల నుంచి స్పందన తక్కువగా ఉంది. ముందు పాత పనులు పూర్తి చేయండి.. ఆ తర్వాతే కొత్త భూములు అడగండి అన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ కారణంగానే రెండో విడత భూసమీకరణ ప్రక్రియ మందగించిందన్న ప్రచారం జరుగుతోందిఅమరావతిలో క్వాంటం వ్యాలీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్టుల ప్రకటనలు ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం పెట్టుబడిదారులను ఆలోచనలో పడేస్తోంది. రాజధాని ప్రాంతంలో స్థిరాస్తి ధరలు పెరిగినప్పటికీ, వాస్తవంగా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో కొనుగోలుదారు లు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు , ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండిరూ. 15,000 కోట్ల వరకు నిధులు సమీకరించినప్పటికీ, ఆ నిధులను వేగంగా ఖర్చు చేసి పనులు పూర్తి చేయకపోతే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ప్రస్తుతం నిర్దేశించుకున్న 2027-28 లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం భవనాలపైనే కాకుండా, రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది నిర్మాణ సంస్థలపై పర్యవేక్షణ పెంచి, రెండో విడత భూసమీకరణకు వెళ్లే ముందే మొదటి విడత ఫలితాలను కళ్లముందు చూపాల్సిన అవసరం ఉంది. అప్పుడే రెండో విడతలో భూములుఇచ్చేందుకు రైతులు మరింత ఆసక్తి చూపే అవకాశం ఉంది.

## మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

అనంతపురం,మార్చి21: అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతరాయ చౌదరి స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు ..

## ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత

### ప్రకటించుకున్న ఇరాన్

టెహ్రాన్,మార్చి21: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే ఆమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది .ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గ్గ÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది.

## నిర్లక్ష్యం కూడదు!



ఇటీవల దేశంలోని వివిధ నగరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలు మన వ్యవస్థలోని భద్రతా లోపాలను ఎత్తి చూపిస్తున్నాయి. ఢిల్లీ, ఇండోర్ నగరాల్లో నివాస భవనాలు మంటల బారిన పడడం, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు- పిల్లలు, మహిళలతో సహా విగత జీవులు కావడం విషాదకరం. ఒడిషాలోని కటక్ ప్రభుత్వాసుపత్రి ఐసియులో మంటలు చెలరేగి 12 మంది రోగులు మృతి చెందటం బాధాకరం. భద్రం అని భావించి ఇళ్లల్లో ఆదమరచి నిదురపోతున్నప్పుడు, అనారోగ్యం నుంచి బయటపడటానికి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నప్పుడు ఇలా అగ్నికీలలకు బలి కావటం... ఆయా కుటుంబాలకు తీరని దు:ఖం, పూడని వెలితి కలిగిస్తుంది. జాగ్రత్తకు, అప్రమత్తతకు చిరునామాగా ఉండాల్సిన ఐసియుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించటం చాలా ఆందోళనకరం. వాటి నిర్మాణంలోనూ, నిర్వహణలోనూ, ప్రమాణాల పాటింపులోనూ తిష్ట వేసిన నిర్లక్ష్యానికి నిదర్శనం.అగ్ని ప్రమాదాల కారణంగా మనదేశంలో ఏటా 22 వేల మంది మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. సగటున రోజుకు 59 మంది మంటలకు బలవుతున్నారు. ఇందులో 66 శాతం మంది మహిళలు కావడం గమనార్హం. అగ్నిప్రమాదాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచం మొత్తం మీద జరిగే అగ్ని ప్రమాదాల్లో ఐదింట ఒకటి మనదేశంలోనే సంభవిస్తోంది. నివాస గృహాల్లో, ఆసుపత్రి ప్రాంగణాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలు గతంలోనూ ఉన్నాయి. 2000 సంవత్సరం ఆగస్టులో విజయవాడలో ఒక కార్పొరేట్ హాస్పటల్ నిర్వహిస్తున్న కోవిడ్ కేర్ సెంటర్లో అగ్నిప్రమాదం జరిగి, 10 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అక్టోబర్‌లో రాజస్థాన్‌లోని ఐసియులో ఇలాంటి సంఘటనే జరిగి, ఆరుగురు రోగులు మృతి చెందారు. 2024లో ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ హాస్పటల్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి, నవజాత శిశువులు చనిపోయిన దుర్ఘటన దేశం అంతటినీ కలచివేసింది. 2021లో మహారాష్ట్రలో ఇలాంటి ప్రమాదాలు రెండు నమోదయ్యాయి. 2016లో భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు హాస్పటల్ ఐసియులో మంటలకు 22 మంది బలయ్యారు. ఈ సంఘటన తరువాత భద్రతా ప్రమాణాల పెంపు మీద, తనిఖీల మీద దృష్టి పెట్టినట్టు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్ని నిరోధక చర్యల కోసం ప్రత్యేకంగా రూ.320 కోట్లు వెచ్చించి, వివిధ రక్షణ ఏర్పాట్లు చేసినట్టు కూడా వివరించింది. అయినా, కటక్ ప్రభుత్వ ఎస్‌సిబి మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్ నిర్వహణలోని ట్రామా కేర్ సెంటర్లో అగ్ని ప్రమాదాన్ని నివారించలేకపోయారు. ఆ ఆసుపత్రి ఆవరణలోనే అగ్ని నిరోధక విభాగం ఉంది. సిబ్బంది వారికి సకాలంలో సమాచారం ఇవ్వలేదని, అందుచేత అరగంట ఆలస్యంగా మంటల నియంత్రణ, రోగుల రక్షణ చర్యలు మొదలయ్యాయని అధికారులు చెబుతున్నారు. అగ్ని నిరోధక సిబ్బంది కూడా తమ వద్ద ఉన్న ఉపకరణాలను సమర్థవంతంగా ఉపయోగించలేకపోయారని అంటున్నారు. ఆపద చుట్టుముట్టిన వేళ అప్రమత్తం కావటంలోనూ, నివారణోపకరణాలను వినియోగించటంలో తగిన తర్ఫీదు, సన్నద్ధత లేకపోవటం ఆక్షేపణీయం. చాలా సందర్భాల్లో పాలకులు సంఘటన జరిగినప్పుడు హడావి డి చేసి, ఆనక ఆ సంగతిని విస్మరించటమే ఇలాంటి దుస్థితికి కారణం.

అగ్ని ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవటం, జరిగితే వెంటనే అదుపు చేసి, ప్రాణనష్టాన్ని నివారించటం ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలి. దీనికి సంబంధించి భవన నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లు ఎలా ఉండాలి? ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కర్మాగారాల నిర్వహణ ఎలా జరగాలి? అన్న దానిపై ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శ కాలు ఉన్నాయి. వాటిని అమలు చేయటంలో అధికార యంత్రాంగపు ఉదాసీనత, మొక్కుబడి తంతు అసలు సమస్య. ప్రమాదం జరిగినప్పు డు చేసే హడావిడి ఒక వ్యవస్థాగత విధానంగా, అప్రమత్తతగా కొనసా గకపోవటం మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరగటానికి తావిస్తోంది. అలాగే, మంటలను నిరోధించటానికి నీటిని మాత్రమే ఉపయోగించటం పాత పద్ధతి. కార్బన్ డయాక్సైడ్, ఫోమ్ వంటి నిప్పు నిరోధకాలను ఎక్కువగా వినియోగించాలి. తగిన సంఖ్యలో సిబ్బంది నియామకం, నైపుణ్యాల పెంపు, మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి చర్యలు కూడా చాలా అవసరం




## ‘ధురంధర్ 2’ బాక్సాఫీస్ దగ్గర సంచలనం..

# ఫస్ట్ డేలోనే రికార్డుల వర్షం



మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ ‘ధురంధర్ 2’ విడుదలైన మొదటి రోజే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రం బుధవారం సాయంత్రం నుంచే ప్రీమియర్ షోలతో తన దూకుడు మొదలుపెట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రీమియర్ షోల ద్వారానే ఈ సినిమా ఇండియాలో సుమారు రూ.43 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించింది. దీంతో ప్రీమియర్ షోల ద్వారా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా ఇది కొత్త రికార్డు నెలకొల్పింది.గురువారం (మార్చి 19) అధికారికంగా విడుదలైన ఈ చిత్రం, మొదటి రోజే దేశవ్యాప్తంగా థియేటర్ల వద్ద భారీగా ప్రేక్షకులను ఆకర్షించింది. ఫస్ట్ డే ముగిసే సరికి ‘ధురంధర్ 2’ ఇండియాలోనే సుమారు రూ.146 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఫస్ట్ డేలోనే రూ.100 కోట్ల మార్క్ దాటిన తొలి హిందీ సినిమాగా ఇది చరిత్ర సృష్టించింది. ఇందులో హిందీ వెర్షన్ నుంచే రూ.103 కోట్లకు పైగా వసూళ్లు రావడం విశేషం. ఈ రికార్డులతో ‘జవాన్’, ‘పఠాన్’, ‘యానిమల్’ వంటి బిగ్గెస్ట్ ఓపెనర్స్‌ను ఈ సినిమా దాటేసింది. అలాగే ఆల్ ఇండియా స్థాయిలో ‘బాహుబలి 2’, ‘ఆర్ఆర్ఆర్’ వంటి భారీ చిత్రాల ఫస్ట్ డే రికార్డులను కూడా అధిగమించింది. అన్ని భాషల్లో కలిపి చూస్తే ‘పుష్ప 2’ తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద ఓపెనింగ్ సాధించిన సినిమాగా నిలిచింది.హిందీతో పాటు దక్షిణాది భాషల్లో కూడా ఈ చిత్రం దుమ్ము రేపుతోంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ రూ.2 కోట్లకు పైగా వసూళ్లు సాధించగా, తమిళంలో కూడా మంచి రెస్పాన్స్ దక్కుతోంది. అన్ని ప్రాంతాల్లో రెగ్యులర్ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన ఈ స్పై డ్రామాలో రణ్‌వీర్ సింగ్ ఎనర్జీ, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ నటుల నటన సినిమాకు మరింత బలం చేకూర్చింది. మొదటి భాగం భారీగా వసూళ్లు సాధించిన నేపథ్యంలో, ‘ధురంధర్ 2’ కూడా అదే స్థాయిని దాటి మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం మరికొన్ని రోజులు సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ‘ధురంధర్ 2’పై మహేశ్, ఎన్టీఆర్ ప్రశంసల జల్లు..



‘ధురంధర్: ది రివెంజ్’ (‘ధురంధర్ 2’) చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనతో పాటు సినీ పరిశ్రమ ప్రముఖుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంటోంది. ఇప్పటికే అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాన్ని మెచ్చుకోగా, తాజాగా సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టాలీవుడ్ అగ్ర హీరోలు ఒకరి తర్వాత ఒకరు ఈ సినిమాను కొనియాడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


**ఒక విస్ఫోటనంలా ఉంది: మహేశ్ బాబు**

‘ధురంధర్ 2’ సినిమాపై మహేశ్ బాబు ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “ఈ సినిమా ఒక పెను విస్ఫోటనంలా ఉంది. ఎంతో కచ్చితత్వంతో తెరకెక్కించారు. రణ్‌వీర్ కెరీర్‌లోనే అత్యుత్తమ నటనను ప్రదర్శించారు. దర్శకుడు ఆదిత్య ధర్ ఈ చిత్రాన్ని రూపొందించిన విధానం, స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వదగ్గ అనుభూతిని అందించింది. నటుడు మాధవన్ నటన, శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఇది కచ్చితంగా థియేటర్లలో అనుభూతి చెందాల్సిన సినిమా. చిత్ర బృందానికి నా అభినందనలు” అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**మాస్టర్‌క్లాస్ ప్రదర్శన: తారక్**

జూనియర్ ఎన్టీఆర్ కూడా ఈ సినిమాపై ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. “భారత ప్రేక్షకులకు ఒక తుపానును అందించిన ‘ధురంధర్ 2’ బృందానికి నా సెల్యూట్. రణ్‌వీర్ నటన అద్భుతం. తెరపై ఆయన ఒక మాస్టర్‌క్లాస్ ప్రదర్శించారు” అని కొనియాడారు. దర్శకుడు ఆదిత్య ధర్ విజన్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. “ఇలాంటి సినిమాను తెరకెక్కించడానికి ఎంతో ధైర్యం, నిర్భయమైన విజన్ కావాలి. ప్రతీ సన్నివేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దారు. భావోద్వేగాలను తట్టిలేపి, సినిమా ముగిశాక కూడా మనతో ఉ ండే చిత్రమిది” అని వివరించారు. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ నటనను కూడా తారక్ మెచ్చుకున్నారు. ఈ అగ్ర హీరోలే కాకుండా స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్‌తో పాటు సిద్ధార్థ్ మల్హోత్రా, కార్తీక్ ఆర్యన్, ప్రీతి జింటా వంటి పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా ‘ధురంధర్ 2’పై పాజిటివ్ రివ్యూలు పంచుకున్నారు. విడుదలైన నాటి నుంచి కేవలం ప్రేక్షకులనే కాకుండా పరిశ్రమలోని అగ్ర తారలను కూడా ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.

# ‘డెకాయిట్’ కోసం ప్రతి సీన్ రెండుసార్లు చిత్రీకరణ... ఎందుకో చెప్పిన అడవి శేష్



విలక్షణ నటుడు, రచయిత అడివి శేష్ తన రాబోయే చిత్రం ‘డెకాయిట్’ ప్రమోషన్లలో భాగంగా ద్విభాషా చిత్రాల చిత్రీకరణలో ఎదురయ్యే సవాళ్లు, అనుభవాలను పంచుకున్నారు. తాను, దర్శకుడు షానీల్ డియో కలిసి ఈ సినిమాకు కథ రాశామని, షూటింగ్ సమయంలో తమ మధ్య అద్భుతమైన స్వేచ్ఛ ఉండేదని ఆయన తెలిపారు. తాజాగా ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శేష్ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ద్విభాషా చిత్రాల రూపకల్పన గురించి శేష్ వివరిస్తూ, “సెట్స్‌లో మా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాలు లేని నిజాయతీ ఉండేది. ఒక షాట్ నాకు నచ్చకపోయినా, ఆయనకు నచ్చకపోయినా ముఖం మీదే చెప్పేసుకు నేంత స్వేచ్ఛ మాకుంది. వృత్తిపరమైన అడ్డంకులు ఏవీ లేకపోవడం మాకు కలిసొచ్చింది. దీన్నే నిజమైన భాగస్వామ్యం అంటారు. దర్శకుడు షానీల్ మాతృభాష హిందీ కాగా, నేను తెలుగు వాడిని. దీంతో రెండు భాషల్లోని నేటివిటీ, భావోద్వేగాలు సరిగ్గా పండేలా చూసుకునే బాధ్యతను పంచుకున్నాం” అని తెలిపారు. షూటింగ్ ప్రక్రియను వివరిస్తూ, “దర్శకుడిగా షానీల్ ముందుగా సీన్ యొక్క మూడ్‌ను సరిగ్గా సెట్ చేసుకోవడానికి హిందీలో చిత్రీకరించేవారు. ఆ తర్వాత, తెలుగు నేటివిటీకి అనుగుణంగా నేను ఆ సీన్‌ను మార్పులు చేసి నటించేవాడిని. ఆయన అనుకున్న విధంగానే సీన్ వచ్చిందో లేదో సరిచూసుకునేవాళ్లం. ఇలా ప్రతీ సీన్‌ను, ప్రతీ డైలాగ్‌ను, ప్రతీ టేక్‌ను హిందీకి వేరుగా, తెలుగుకు వేరుగా చిత్రీకరించాం. కొన్నిసార్లు రెండు భాషల్లో స్క్రిప్ట్‌లను కూడా విభిన్నంగా ట్రీట్ చేశాం. ఉదాహ రణకు, తెలుగులో ఒక పంచ్ డైలాగ్ సీన్ ప్రారంభంలో ఉంటే, హిందీలో అదే డైలాగ్ సీన్ చివరిలో లేదా తర్వాతి సీన్‌లో ఉండొచ్చు. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు ఈ మార్పులు చేశాం” అని అడివి శేష్ చెప్పుకొచ్చారు. సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ‘డెకాయిట్’ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం పడిన కష్టం తెరపై కనిపిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఓటీటీలో కంటెంట్ ‘జాతర’..

## ప్రైమ్ వీడియో నుంచి 55 కొత్త ప్రాజెక్టులు!




ఓటీటీ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ వీడియో తన సబ్‌స్క్రైబర్ల కోసం కళ్లు చెదిరే భారీ అప్‌డేట్‌ను ప్రకటించింది. ముంబై వేదికగా గురువారం నిర్వహించిన Prime Video Presents ö It Starts Here 2026 గ్రాండ్ ఈవెంట్‌లో ఏకంగా 55 కొత్త సినిమాలు మరియు వెబ్ సిరీస్‌లను అనౌన్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా తెలుగు మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ప్రైమ్ వీడియో, మన ప్రేక్షకులను అలరించేందుకు భారీ పెట్టుబడులతో క్రేజీ ప్రాజెక్ట్‌లను సిద్ధం చేసింది.

‘హనుమాన్’ స్టార్ తేజ సజ్జా హోస్ట్‌గా వ్యవహరించనున్న గ్లోబల్ హిట్ రియాలిటీ షో ‘ది ట్రైటర్స్’ ఇప్పుడు తెలుగులోకి వస్తుండటం విశేషం, ఇందులో 20 మంది సెలబ్రిటీలు పాల్గొనబోతున్నారు. ఇదే కాకుండా యంగ్ హీరో కిరణ్ అబ్బవరం డిజిటల్ ఎంట్రీ ఇస్తున్న ‘గువ్వల చెరువు ఘాట్’ వెబ్ సిరీస్‌ను భరత్ కమ్మ దర్శకత్వంలో తిరువీర్, సంయుక్త మీనన్ కీలక పాత్రలతో రూపొందిస్తున్నారు. పీరియాడిక్ క్రైమ్ డ్రామాగా వస్తున్న ‘ఇసాకపట్నం’లో ఐశ్వర్య రాజేష్, సముద్రఖని నటిస్తుండగా, వీటితో పాటు ‘జగమే సంగీతం’, ‘గల్లీ’ వంటి సరికొత్త షోలు మరియు ‘ఇన్‌స్పెక్టర్ రిషి సీజన్ 2’ కూడా తెలుగులో సందడి చేయనున్నాయి.

# ‘కేడీ’ పాటపై కేంద్రం నిషేధం..



కన్నడ చిత్రం ‘కేడీ: ద డెవిల్’లోని ‘సర్కే చునార్ తేరి సర్కే’ అనే ప్రత్యేక గీతం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ‘దారుల్ ఇఫ్తా’ అనే ముస్లిం మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. మరోవైపు వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ధ్రువీకరించారు. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని, ఇటువంటి ప్రదర్శనలు సమాజంలోకి తప్పుడు సందేశాన్ని పంపుతాయని దారుల్ ఇఫ్తా సంస్థ తన ఫత్వాలో పేర్కొంది. ముఖ్యంగా ముస్లిం యువతను ఈ పాట తప్పుదోవ పట్టించేలా ఉందని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలోనే నోరా ఫతేహీపై ఫత్వా జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ వివాదంపై నటి నోరా ఫతేహీ స్పందిస్తూ తన వివరణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం ఈ పాటలో నటించేందుకు అంగీకరించానని, సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం, అలాగే ఇది ‘నాయక్ నహీ ఖల్ నాయక్ హూ మై’ వంటి ఐకానిక్ పాటకు రీమేక్ కావడంతోనే ఒప్పుకున్నానని తెలిపారు. తనకు కన్నడ భాష రాదని, అప్పట్లో చిత్రబృందం చెప్పిన అనువాదం అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె స్పష్టం చేశారు.

**ఫత్వా అంటే ఏమిటి?.. చట్టబద్ధత ఎంత? :** ఇస్లామిక్ పండితులు ఏదైనా ఒక అంశంపై ఇచ్చే అభిప్రాయం లేదా మతపరమైన తీర్పునే ‘ఫత్వా’ అంటారు. అయితే, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో ఫత్వాలకు ఎలాంటి చట్టపరమైన గుర్తింపు లేదు. ఫత్వా జారీ చేసినంత మాత్రాన పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేరు. అలాగ్ న్యాయస్థానాలు దానిని ఆధారంగా తీసుకోవు. ఇది కేవలం ఒక మతపరమైన అభిప్రాయం మాత్రమే. ఇక్కడ భారత రాజ్యాంగం, దేశ చట్టాలే అత్యున్నతమైనవి. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘కేడీ: ద డెవిల్’ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. ’చెక్’, ’రంగ్ దే’, ’మ్యాస్ట్రో’, ’మాచర్ల నియోజకవర్గం’, ’ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్’ వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన ’తమ్ముడు’, ’రాబిన్‌హుడ్’ సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి ’ఆయ్’ సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ.

# ముస్లిం సోదర, సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు

## జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, మార్చ్21(విజన్ ఆంధ్ర) నల్లగొండ కార్పొరేషన్ లోని మునుగోడు రోడ్డు ప్రార్థన మందిరం ఈద్గాను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు.రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ప్రార్థన మందిరం ఈద్గాను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రజలందరూ పరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడాలని ఆయన సూచించారు.నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు జిల్లా ఎస్పీశుభాకాంక్షలు తెలియజేశారు.ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

# బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో నల్గొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### ద్విచక్ర వాహనం నడుపుతూ గ్రామంలో సాగునీటి కాలువలను పరిశీలించిన మంత్రి



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, మార్చ్21,(విజన్ ఆంధ్ర)నల్గొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను పరిశీలించారు.మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ సాగునీటి కాలువలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ పనులకు మంత్రి అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూబ్రాహ్మణవెంలంలో ప్రాజెక్టు కాలువల ద్వారా నల్గొండ నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపి ప్రతి ఎకరానికి నీరు అందిస్తామన్నారు.నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తన ధ్యేయమని తెలిపారు.పిల్లకాలువ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఎకనామిక్స్ ఫలితాల్లో ఎంవి ఎన్ విజ్ఞాన కేంద్రం విద్యార్థులు ప్రతిభ



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, మార్చ్21(విజన్ ఆంధ్ర )డిసెంబర్ 24,2025న నిర్వహించిన టీజీ ఎస్ ఈ టి పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల కాగా, ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న నల్గొండ ఎకనామిక్స్ ఫోరమ్ విద్యార్థులు16 మంది ఎకనామిక్స్‌లో సెట్ అర్హత సాధించినట్లు విజ్ఞాన కేంద్రం కన్వీనర్,నల్గొండ ఎకనామిక్స్ ఫోరమ్ అధ్యక్షులు డా.అక్కెనపల్లి మీనయ్య తెలిపారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇదే సందర్భంలో ఫిబ్రవరి నెలలో ప్రకటించిన ఎన్ ఈ టి ఎకనామిక్స్ ఫలితాల్లో 5 మంది విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత,10 మంది పీహెచ్‌డీ అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.ఈ విధంగా మొత్తం 31మంది విద్యార్థులు ఎన్ ఈ టి,ఎస్ ఈ టి అర్హతలు సాధించడం ఫోరమ్ నిరంతర కృషికి నిదర్శనమని తెలిపారు.ఎన్ ఈ టి ఫలితాల్లో అర్హత సాధించిన విద్యార్థులు కె.సాయిచంద్ర,నిమ్మల ఎల్లయ్య, జి.కృష్ణ,జి.ప్రభాకర్‌రెడ్డి,బి.శారద,కొండపాక అనూహ్య, హేమలత,బి.శివరాజులు,జి.ఇందు,శివశంకర్,నాసర్ పాషా,వి.కౌసల్య,ఎన్. లావణ్య,ఎ.శిరీష,గుగులోత్ విజయ, తలసాని నవనీత.నాలుగు నెలలపాటు ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా తరగతులు నిర్వహించడం,అలాగే వెబ్‌సైట్ ద్వారా సి బి టి పరీక్షలు నిర్వహించడం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు.ఫలితాలపై ఫోరమ్ అసోసియేట్ అధ్యక్షులు త్రిపురం భాస్కర్ రెడ్డి,ఉపాధ్యక్షులు దుబ్బ రంజిత్,కార్యదర్శి షేక్ సుల్తానా,ఉప కార్యదర్శి డా.అక్కెనపల్లి దీపిక,కోశాధికారి కె.గోపి, కార్యవర్గ సభ్యులు టి.సుధారాణి,వి.ఇందిర,బుగ్గ నరేందర్,డా.డి.ప్రవళిక హర్షం వ్యక్తం చేశారు.

# నేడే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి పర్యవేక్షిస్తున్న మంత్రులు. తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి మార్చ్ 21సిద్దిపేట జిల్లా ఇజ్జత్ పోయినట్టుగా అందరి మొగుడు అంటే ఇప్పుడు మనోడునర్మేట లో రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నేపథ్యంలో అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్..హెలిప్యాడ్ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు.అక్కడి నుండి నేరుగా కర్మాగారం ప్రారంభోత్సవం చేసే ప్రదేశానికి వెళ్లి అక్కడ ఏర్పాట్లు పరిశీలించారు..అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన 150 స్టాల్ లను పరిశీలించారు.. ముఖమంత్రి గారు స్టాల్ లు పరిశీలించి ఆయిల్ రిఫైనరీ కి శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని పరిశీలించారు..అక్కడి నుండి సభ స్థలి లో ఏర్పాట్లను పరిశీలించారు..కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లిసత్యనారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి,సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు లిమంత్రి పొన్నం ప్రభాకర్తెలంగాణ లో ఆయిల్ ఫామ్ అభివృద్ధి చేయడానికి తాను స్వయంగా ఆయిల్ ఫామ్ రైతుగా ఫ్యాక్టరీ నిర్మాణానికి పూర్తిక కార్యదీక్షత చేపట్టారు.. స్వయంగా చాలసార్లు ఫ్యాక్టరీ పరిశీలించారు..గుజరాత్ లో పాల కు కురియన్ మాదిరి ఆయిల్ ఫామ్ కి తుమ్మల నాగేశ్వరరావు గారు..ఆయిల్ ఫామ్ సాగు తో కోతుల బెడద ఉండదు ,వర్షాలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు ఉండవు ఉత్తర తెలంగాణ కు ఈ ఫ్యాక్టరీ ఆయిల్ ఫామ్ సాగు చేసిన వారికి ప్రధాన కేంద్రంగా ఉండబోతుంది.. రేపు ముఖ్యమంత్రి గారు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తారు..రిఫైనరీ కి శంకుస్థాపనచేస్తారు..రైతులంతా ఆయిల్ ఫామ్ సాగు పై దృష్టి సారించాలి.. దీని ద్వారా ఎలాంటి నష్టాలు లేకుండా లాభాలు ఉంటాయి..గంటకు 30 టన్నుల నుండి 180 టన్నుల క్రషింగ్ కెపాసిటీ ఈ ఫ్యాక్టరీ కి ఉంది.ఆయిల్ ఫామ్ కి బ్రాండ్ అబాసిటర్ తుమ్మల నాగేశ్వరరావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతెలంగాణ నడిగడ్డ సిద్దిపేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి గారు ప్రారంభోత్సవంచేయబోతున్నారుఆయిల్ ఫామ్ 30 జిల్లాలో గత 4-5 సంవత్సరాలుగా ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి రైతులు ముందుకు వచ్చారు.. 30 జిల్లాలో ప్రైవేట్ కంపెనీలు ముందుకు వచ్చాయి..సిద్దిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ముఖ్యంగాఉండబోతుంది..నేను వ్యవసాయ శాఖ మంత్రి అయిన తర్వాత మొదటి సంతకం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కి చేశాను..32 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పడింది..2024 జనవరి లో టెండర్లు పిలవడం జరిగింది.. తరువాత డిసెంబర్ వరకు ఆ టెండర్లు జరిగాయి..300 కోట్లు ఈ ఫ్యాక్టరీ కి ఖర్చు చేయడం జరిగింది..30 టన్నుల నుండి 120 టన్నుల వరకు దీని సామర్థ్యం ఉంది..అతి తక్కువ సమయంలో కేవలం 16 నెలల్లోనే పూర్తి చేసిన దేశంలోనే మొదటి ఫ్యాక్టరీ..హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి అవకాశం ఉంది..గతంలో రాష్ట్రంలో ఎక్కడ సాగు చేసిన దానిని అశ్వారావుపేట కి తీసుకెళ్లాల్సి వచ్చేదిఅందుకే సిద్దిపేట జిల్లాలో తక్కువ సమయంలో ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేయడం జరిగింది..ఇక్కడే వచ్చే వెస్టేజస్ తో 4 మెగావాట్ల విద్యుత్ఉత్పత్తిజరుగుతుంది..ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటుచేసుకున్నాం..ఇక్కడే స్వతంత్రముగా ఆయిల్ రిఫైనరీ ప్రారంభిస్తున్నాం.. ఇక్కడి నేరుగా విజయ బ్రాండ్ ద్వారా లబ్ధిదారులకు ఆయిల్ వస్తుంది.గెల అమ్మిన మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు వస్తాయి..తెలంగాణ లో ఎక్కడ ఆయిల్ ఫామ్ సాగు చేసిన ఆయిల్ ఉత్పత్తి ఇక్కడి నుండే జరుగుతుంది.మలేషియా కంటే కూడా మన దగ్గర అధిక ఆయిల్ ఇక్కడి నుండే వస్తుంది..ఏ వాతావరణంలో అయినా ఆయిల్ ఫామ్ సాగు చేయవచ్చు..మల్లన్న సాగర్ రాకముందే ఇక్కడ మొక్కలు పెట్టడం జరిగింది..ఈ ఫ్యాక్టరీ ప్రజలది.. పాలకులు మారిన ప్రభుత్వం మారదు..కాళేశ్వరానికి జీవనాడి ఎల్లంపల్లి ..మీరు ఎక్కడి నుండి ఎక్కడికి నీళ్లు తరలించాలన్న ఎల్లంపల్లి కీలకం.. ఎల్లంపల్లి నిర్మించింది కాంగ్రెస్ పార్టీ..ఎల్లంపల్లి నుండి మంచి నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే .. స్విచ్ వేరే ప్రభుత్వం వాళ్ళు నొక్కారు..పెండింగ్ ఉన్న ప్రాజెక్ట్ లు పూర్తి చేసీ ప్రజల అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వాలది..కేంద్ర ప్రభుత్వం మా వాటా గా మా హక్కుగా రావాల్సింది ఇస్తున్నారు.. అందులో మీరు ఇచ్చేది ఏముంటది..నా స్థానంలో నేనులేకున్నఎవరున్నా. .ఇక్కడఫ్యాక్టరీవచ్చేది..ఇక్కడైతేనేప్రజలకుఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి గారితో చెప్పి నిధులు మంజూరుచేసుకున్నాం..నేను వచ్చిన తరువాత 5 ఫ్యాక్టరీ లు సంతకం చేసిన ముందుగా పూర్తి చేసింది నర్మెట..ఇది అన్ని జిల్లాలకు అనుగుణంగా మద్యలో ఉంటుంది..హైదరాబాద్ కి దగ్గర లో ఉంటుంది..ఈ ఫ్యాక్టరీ ఆయిల్ ఫామ్ రెమ్యునరేషన్ నుండి కట్టామ్..ఇది ప్రజల డబ్బు..ప్రజల సొత్తు..భారతదేశంలో తెలంగాణ ఆయిల్ ఫామ్ లో ముందుండాలి..నేను మంత్రి అయిన తర్వాత 13 వేలు ఉండే ఇప్పుడు 21 వేలు టన్ను అయింది..ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయినప్పటి నుండి ఆయిల్ ఫామ్ సాగును నేను ప్రమోట్ చేస్తున్నా..10 సంవత్సరాల్లో మీరు చేసిన రుణమాఫీ కరెక్ట్ అని మీరు భావిస్తే మీకు ఈ గతి పట్టదు..ఎన్నికలు వచ్చినప్పుడల్లా నీరు నాలుగు టర్మ్ లలో డబ్బులు వేయడం వల్ల రైతు పై రుణభారం పడింది.. రైతు వద్దులే 8 వేల కోట్లు అయింది..మేము అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పాం..మేము ఒకే సారి రుణమాఫీ చేశాం..గత ప్రభుత్వం విడతల వారిగా వేయడం వల్ల ఆ డబ్బులు వడ్డీలకే సరిపోలేదు..పంటరుణాలు అంటే ఒక సంవత్సరానికి ఇచ్చేస్వార్టర్మ్రుణాలు.కమర్షియల్ లోన్స్ లో భూమి తాకట్టుపెట్టిఇచ్చేరుణాలు..తెలంగాణ లో అన్ని బ్యాంకులను 2 లక్షల లోపు ఉన్న రైతుల వివరాలు తెప్పించడం జరిగింది..25 లక్షల మందికి 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేయడం జరిగింది..25 లక్షల పేర్లు శాసన సభ లో పెట్టాం..దేశంలో మొదటిసారి 21 వేల 671 కోట్లు ఒకేసారి రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలో తెలంగాణ ఒకటే.మళ్ళీ పెండింగ్ లో ఏదైనా సాంకేతిక సమస్య ఉండి రుణమాఫీ కానీ వారికి మహబూబ్ నగర్ సభ వేదికగా మళ్ళీ 3 వేల కోట్లు ఇవ్వడంజరిగిందితరువాత వచ్చిన ఏ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్నినమ్మలేదు..పార్లమెంట్ఎన్నికలు ,ఉపఎన్నికలు ,పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడ ప్రజలు మిమ్మల్ని నమ్మలేదు..రెండు సంవత్సరాల్లో రేవంత్ రెడ్డి ఏం చేశారో ప్రజలు ఇచ్చే తీర్పు నిదర్శనం..ప్రజలకు కన్ఫ్యూజన్ లేదు..అసత్య ఆరోపణలు బంద్ చేయాలి.కోహెడ మొక్కజొన్న రైతులు అడగగానే మొక్కజొన్న కేంద్రాలు తెరిచాం.. కానీ మా వల్లే తెరిచారనిప్రకటించుకున్నారు..ఎప్పటికి అబద్ధాలు ఆడడమేనా..? రైతు భరోసా కి 2018-19 లో5నెలలుతీసుకున్నారు2020-21లో5నెలలుతీసుకున్నారుభారతదేశంలో 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మాత్రమే.మీరు చేసిన 8 1/2 లక్షల కోట్లకు 7 వేల కోట్ల వడ్డీ కట్టాలి.. ఆర్థిక పరిస్థితి మీరు చేసిన అప్పులకు వడ్డీకే సరిపోతుంది.మీరు ఇచ్చిన హామీలు ఎన్ని పూర్తి చేశారు.. దళితులకు 3 ఎకరాలు ఏమైంది.. దళిత బంధు ఏమైంది.మేము వచ్చిన 48 గంటల్లో మహా లక్ష్మీ ద్వారా మహిళలు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం..500 కి గ్యాస్ ఇస్తున్నాం.. రాజీవ్ ఆరోగ్య శ్రీ 5-10 లక్షలకు పెంచాం..మీ వల్ల పరిపాలన వ్యవస్థ నాశనం అయింది..ప్రజలు నష్టపోయారు..అదే కాళేశ్వరం పై ఇచ్చంపల్లి , దుమ్ముగూడెం పై అనాటి కేబినెట్ లోనే చెప్పా..మీ అవినీతి కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారు..మీరు చేసిన నిర్వకానికి రేయింబవళ్ళు పనిచేసిన కష్టాలు తీరడం లేదు..ముఖ్యమంత్రి గారి రైతాంగ మహోత్సవాల్లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా రైతులు భారీగా పాల్గొనాలి. 3600 కోట్లు రైతు భరోసా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా విడుదల అవుతాయి.ఎన్నికల ముందు ఇచ్చిన సంక్షన్స్ ఎక్కడ ఆపలేదు..

# సీఎంఆర్ఎఫ్ తో బాధితులకు ఆర్థిక చేయూత

## వెంకటేష్ యాదవ్



మల్కాజిగిరి, మార్చి 21, (విజన్ ఆంధ్ర): సీఎం ఆర్ ఎఫ్ అనారోగ్యంతో బాధపడే వారికి ప్రభుత్వం అందజేసేఆర్థిక చేయూత అని కాంగ్రెస్ పార్టీ , మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు టి.వెంకటేష్ యాదవ్ అన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ బండ చెరువు ప్రాంతానికి చెందిన అంకుర్ గౌస్ కుమారుడు ఆర్యన్ గౌస్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యేమైనంపల్లి హనుమంతరావు, సీఎం ఆర్ ఎఫ్ ద్వారా అక్షరాల మూడు లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఆయన ఆదేశాలు మేరకు శనివారం సీఎం ఆర్ ఎఫ్ ఎల్ఓసి పత్రాన్ని బాధితుడి కుటుంబీకులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. తమ కుమారుడు ఆపరేషన్ కోసం సహాయం చేసిన మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు బాధితుని తండ్రి అంకుర్ గౌస్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి వర్కింగ్ ప్రెసిడెం ట్ బి కే శీను, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, సీనియర్ నాయకులు కపిల్, వైనాల ప్రవీణ్ కుమార్, బాల రాజు యాదవ్, ధరన్, కుట్టి శ్రీను, జాన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దు

## వాణిజ్య సముదాయాల వద్ద అవగాహన సమావేశం


### -వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 21, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ పట్టణంలో గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న ఘటనలు గమనించబడిన నేపథ్యంలో శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాణిజ్య సముదాయాల వద్ద అవగాహన కల్పించబడింది. ఈ అవగాహన సదస్సులో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ బి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ బి. సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీతో ప్రజలకు అందిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు మరియు ఇతర వ్యాపార సంస్థల్లో వినియోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమే కాకుండా ప్రజల ప్రాణ భద్రతకు కూడా ముప్పు కలిగిస్తాయని తెలిపారు.డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం వల్ల గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాలు వంటి ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు.ఇకపై ఎవరైనా గృహ వినియోగ గ్యాస్‌ను అక్రమంగా వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఇటువంటి అక్రమ వినియోగం గమనించినట్లయితే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజ భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, హోటల్ యజమానులు మరియు స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగనాథ్, అశోక్, అఖిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీస్ తనిఖీలు

## పోలీస్ కమిషనర్




ఖమ్మం మార్చ్ 21 (విజన్ ఆంధ్ర)నేరాల నియంత్రణలో భాగంగా అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఏటియం సెంటర్లు, బ్యాంకుల పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను, వాహనాలను తనిఖీ చేశారు. అదేవిదంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా ఇసుక, గంజాయి , రేషన్ బియ్యం వంటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. అదేవిధంగా మద్యం మత్తులో వాహనాలు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథంలో డ్రంక్ అండ్ తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు గాని, వాహనాలు గాని తారసపడితే వాటి గురించి పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు.

# గిరిజనులను నిండా ముంచిన ప్రజా వ్యతిరేక బడ్జెట్

## ఎన్నికల మేనిఫెస్టోలోఎస్సీ,ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్ను అమలు చేయలేదు

### సక్రు నాయక్ రమావత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, మార్చ్21(విజన్ ఆంధ్ర) గిరిజనులకు ఈ బడ్జెట్లో తీరని అన్యాయం చేసిందని గతంలో కేటాయించిన బడ్జెట్ 40 శాతం కూడా ఖర్చు చేయని రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో 7937 కోట్లుకేటాయిం చిందని గతంలో కేటాయి ంచిన బడ్జెట్ లో 2వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని,మళ్లీ ఈ బడ్జెట్లో గిరిజనులను మోసం చేసే విధంగా ఉందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శక్రు నాయక్ అన్నారు.గిరిజనులను నయవంచన చేసి కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో గిరిజనులను మోసం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని,మూడు బడ్జెట్లో కూడా గిరిజనులకు తీరని అన్యాయం చేశారన్నారు. కేటాయించిన బడ్జెట్ను 40 శాతం ఖర్చు చేయని ఈ బడ్జెట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లంబాడి హక్కుల పోరాట సమితి భావిస్తున్నదన్నారు.6 గ్యారంటీల పేరు చెబుతూ ప్రజలను మోసం చేస్తుందని ఎస్సీఎస్టకు ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలు గాలికి వదిలేసిందన్నారు.ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్,ఇది గిరిజన ప్రజలకు మోసం చేసిన బడ్జెట్ గా భావిస్తున్నామన్నారు.

# మా భూమిలో టిడిపి పార్టీ జెండా పెట్టడం అన్యాయం

## నాకు న్యాయం చేయాలని బాధితురాలు సౌందర్య వేడుకోలు



మంగపేట, మార్చి 21;విజన్ ఆంధ్ర ప్రతినిధిమా భూమిలో టిడిపి పార్టీ జెండా పెట్టి మా భూమిని ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకోవాలి అని సాదుల సౌందర్య ఒక ప్రకటనలో తెలిపారు. మా భర్త సాదుల ప్రసాద్ 1992లో ఎక్కటి శేషా రెడ్డి దగ్గర గంపొని గూడెం మెయిన్ రోడ్డుకు అనుకోని సర్వే నెంబర్ 143లో మూడు గుంటల స్థలం కొనుగోలు చేశారు.నా భర్త మరణానంతరం అభూమిని టిడిపి చెందిన కొంతమంది నాయకులు ఆక్రమించుకొని నన్ను బెదిర్తున్నారు.గతంలో మండల తహసీల్దార్ కు ఫిర్యాదు చేశాను. కానీ నన్ను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.నేను మంగపేట లో లేని సమయం చూసి మంగపేట మండలానికి చెందిన కొంతమంది టిడిపి నాయకులు మా ఇంటి స్థలంలో టిడిపి గద్దె నిర్మాణం చేసి జెండా పెట్టారు. కావున ఈ విషయం లో మండలంలోని నాయకులు, అధికారులు, మండల ప్రజలు నాకు న్యాయం చేయాలని సౌందర్య వేడుకొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.